www.vaarthavedhikasurya.com
PRGI.NO:- TGTEL/25/A0305
# వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి YADADRI BHUVANAGIRI | సంపుటి: 2 VOLUME : 2 | సంచిక: 17 ISSUE : 17 | శనివారం, 6 జూన్, 2026 SATURDAY, JUNE 6, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి EDITOR : POLOJU SRINIVASA CHARY | పేజీలు: 8 PAGES : 8 | వెల: 5-00 RS : 5-00 |
|---|---|---|---|---|---|---|

## భారత్‌కు సుఖోయ్ ఎస్‌యూ 57లను ఇస్తాం

- వాటిని భారత్‌లో తయారుచేసేందుకూ సిద్ధమే
- రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటన



2

## కేసీఆర్.. రాసిపెట్టుకోండి
# మళ్లీ మొలకెత్తనీయం

- కారు గుర్తును మర్చిపోవాల్సిందే! • కేసీఆర్.. దమ్ముంటే అసెంబ్లీకి రావాలి • పదేళ్ల నీ పాలన, నా పాలనపై చర్చిద్దాం • చర్చలో ఓడిపోతే క్షమాపణలు చెబుతా • చర్చకు మహారాష్ట్ర సీఎం దాగుడుమూతలు • ఆయన్ను తీసుకురాకపోతే బీజేపీ నేతలను తరుముడే • జడ్చర్ల ప్రజా పాలన-ప్రగతి ఉత్సవాల సభలో రేవంత్ రెడ్డి

మహబూబ్‌నగర్, జూన్ 5 (వార్త వేదిక సూర్య):

''వచ్చే ఎన్నికల్లో నా సంగతి చూస్తానంటున్న కేసీఆర్‌కు పాలమూరు గడ్డపై సవాల్ విసురుతున్నా.. నిన్ను మళ్లీ మొలకెత్తనివ్వం. మీ పార్టీ జెండాలు ఎగురనివ్వం. గద్దెలు కూలుతాయి. పార్టీ గుర్తును మరిచిపోవాల్సిందే'' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని, 'ఔర్ ఏక్ బార్.. కాంగ్రెస్ సర్కార్' ఏర్పాటు తథ్యమని పునరుద్ఘాటించారు. వచ్చే ఎన్నికల్లో తాను డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించిన ఊర్లలో కేసీఆర్ ఓట్లు అడగాలని, తాను ఇందిరమ్మ ఇళ్లు కట్టిన ఊర్లలో ఓట్లు అడుగుతానని, అలా చేస్తే కేసీఆర్‌కు డిపాజిట్లు కూడా రావని స్పష్టం చేశారు. 2 రోజుల పర్యటనలో భాగంగా పాలమూరు ప్రాజెక్టులను సందర్శించిన ఆయన.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో శుక్రవారం నిర్వహించిన 'ప్రజాపాలన- ప్రగతి ఉత్సవాల' సభలో ప్రసంగించారు. పాలమూరు ప్రాజెక్టులపై పాదయాత్ర చేస్తామని బీఆర్ఎస్ నాయకులు బయల్దేరారని, పాలమూరు నుంచి కాశీ వరకు పొర్లుదండాలు పెట్టినా వాళ్ల పాపాలు తీరవని, ప్రజలు క్షమించరని వ్యాఖ్యానించారు. పాలమూరు జిల్లాలో ఊరు లేకపోయినా.. పార్లమెంటులో నోరు లేకపోయినా.. భుజాలపై మోసి పాలమూరు ప్రజలు పార్లమెంట్‌కు పంపిస్తే పదేళ్లలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ. 1.80 లక్షల కోట్లు ఖర్చు చేసి పాలమూరులో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తిచేయలేదని ధ్వజమెత్తారు. లక్ష కోట్లు ఖర్చు చేసిన కాళేశ్వరం కూలేశ్వరమై కూలిపోయిందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ దమ్ముంటే అసెంబ్లీకి రావాలని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై.. రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనపై చర్చ మిగతా 2లో..



### ప్రాజెక్టులపై ఏపీతో చర్చల్లో సత్ఫలితాలు

- కేసీఆర్ రాసిన మరణ శాసనాన్ని తొలగించబోతున్నాం • పాలమూరు-రంగారెడ్డి, డిండి పథకాలకు నికర జలాలకు సమ్మతి తెలిపి, ఎన్వోసీ ఇస్తేనే తదుపరి చర్చలుంటాయ్ • న్యాయమైన వాటా నుంచి చుక్క నీటిని కూడా వదులుకోం • పాలమూరు పంపులు, లిఫ్టులతో కేసీఆర్ ఇంట్లో కనక వర్షం
- గతంలో భారీగా అప్పులు.. ఇప్పుడు అవసరమైనా తేలేని స్థితి
- పాలమూరు ప్రాజెక్టుల పరిశీలన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

2 లో..



భారత్‌లో 2030 నాటికి

## 3 లక్షల కోట్లు.. 5 గిగావాట్ల
# డేటాసెంటర్లు..

- దేశంలో భారీ పెట్టుబడికి ముందుకొచ్చిన 'ఎయిర్‌ట్రంక్'


న్యూఢిల్లీ, జూన్ 5: ఆసియా-పసిఫిక్, పశ్చిమాసియా ప్రాంతంలో డేటా సెంటర్ల నిర్వహణలో ప్రముఖ సంస్థ 'ఎయిర్‌ట్రంక్' భారత్‌లో 2030 నాటికి రూ.3 లక్షల కోట్ల భారీ పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. ఎయిర్‌ట్రంక్ సీఈవో రాబిన్ ఖుదాతో శుక్రవారం సమావేశమైన అనంతరం.. ప్రధాని మోదీ ఈ విషయాన్ని వెల్లడించారు. ఆ సంస్థ ఈ భారీ పెట్టుబడి ద్వారా దేశవ్యాప్తంగా 5 గిగావాట్ల సామర్థ్యంతో కూడిన హైపర్‌స్కేల్ డేటా సెంటర్లను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని మోదీ ఎక్స్ వేదికగా వెల్లడించారు. దీనిద్వారా భారత్ గ్లోబల్ ఏఐ హబ్‌గా ఎదుగుతుందని, కొత్తగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని మోదీ పేర్కొన్నారు. ఎయిర్ ట్రంక్ సంస్థ సీఈవో ఖుదా మాట్లాడుతూ.. ప్రపంచస్థాయి ఏఐ శక్తి కేంద్రంగా ఎదిగేందుకు అవసరమైన స్థాయి, ప్రతిభ, ఆశయం భారత్‌కు ఉన్నాయన్నారు.

## నీటమునిగి
# 8 మంది మృతి
### మృతుల్లో ఏడుగురు చిన్నారులే..

- మంజీరాలో స్నానానికి దిగి ముగ్గురు.. • కుంటలో పడి మరో ముగ్గురు.. • చెరువులో ఈతకు దిగి ఇద్దరి మృతి • కామారెడ్డి, నిజామాబాద్, మహబూబ్ నగర్ జిల్లాల్లో ఘటనలు

బాన్సువాడటౌన్, భీంగల్, జడ్చర్ల, జూన్ 5 (వార్త వేదిక సూర్య):

కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం బుడ్మి శివారులోని మంజీరా నదిలో స్నానానికి దిగి ముగ్గురు మృతి చెందారు. మంజీరా నది సమీపంలోనే ఉన్న ఎల్లమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకునేందుకు పిట్లం మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన పండరి తన కుటుంబ సభ్యులతో వెళ్లారు. మంజీరా నదిలో ఆరుగురు స్నానానికి దిగగా ఇద్దరు ఒడ్డుపైనే ఉన్నారు. నీటి లోతు కారణంగా మునిగిపోతున్న ఇద్దరిని బయటకు లాగారు. మిగతా నలుగురు గల్లంతయ్యారు. గాలింపులో ముగ్గ



రి మృతదేహాలు లభ్యమయ్యాయి. ఈ ఘటనలో కిష్టాపూర్ గ్రామానికి చెందిన పండరి కుమార్తె పావనశ్రీ (14), లింగంపేట మండలం పరమళ్ల గ్రామానికి మిగతా 2లో..

## చేనేత కళాకారులకు
# ప్రోత్సాహం అందాలి

- చేనేత రంగం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- 'త్రెడ్ పోచంపల్లి' ఎగ్జిబిషన్ ప్రారంభంలో మంత్రి తుమ్మల
- ఏడో తేదీ వరకు హైటెక్స్‌లో ఎగ్జిబిషన్

యాదాద్రి, జూన్ 5 (వార్త వేదిక సూర్య):



తెలంగాణకు గర్వకారణమైన పోచంపల్లి చేనేత కళాకారులకు తగిన ప్రోత్సాహం అందించాలని రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. చేనేత రంగం, కార్మికుల అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన 'త్రెడ్ పోచంపల్లి' ఎగ్జిబిషన్‌ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి మంత్రి తుమ్మల ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలకు లభించిన జియోగ్రాఫికల్ ఇండికేషన్ (జీఐ) ట్యాగ్ చేనేత కళాకారుల సృజనాత్మకతకు, నైపుణ్యానికి దక్కిన అంతర్జాతీయ గుర్తింపు అన్నారు. పోచంపల్లి మిగతా 2లో..



## తమిళనాట కొత్త రాజకీయ ఉద్యమం!

- గౌరవంగానే పార్టీ నుంచి బయటికొచ్చా.. • వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తా
- తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు అన్నామలై వెల్లడి
- మరో ఇద్దరు సీనియర్ నేతల గుడ్‌బై..

2 లో..



## ఆ 40 లక్షల టన్నుల బొగ్గు ఏమైంది?

- రూ.1600 కోట్ల కుంభకోణంపై నిగ్గు తేల్చండి
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి కేటీఆర్ లేఖ

2 లో..

# యువతకు ఉపాధి అవకాశాలు

- దారులు చూపుతున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు • మంత్రి డా.జి.వివేక్ వెంకటస్వామి
- జపాన్‌-తెలంగాణ సహకారానికి కొత్త దిశ.. • ఉపాధి, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో అవకాశాలపై చర్చలు



హైదరాబాద్, జూన్ 5 (వార్త వేదిక సూర్య):

ప్రపంచ ఉద్యోగ విపణిలో చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా తెలంగాణ యువతను సిద్ధం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదాయ పారిశ్రామిక శిక్షణా సంస్థలను (ఐటీఐలు) అత్యాధునిక అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీలు) తీర్చిదిద్దిందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు మరియు భూగర్భ వనరుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. ఈ కేంద్రాలు కేవలం శిక్షణా సంస్థలుగానే కాకుండా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు మరియు అంతర్జాతీయ కెరీర్‌లకు ద్వారాలుగా మారుతున్నాయని పేర్కొన్నారు.మల్లేపల్లి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను విడియా ప్రతినిధులతో కలిసి సందర్శించిన అనంతరం మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ట్రైనర్లు ఏటీసీల్లో అత్యాధునిక మౌలిక సదుపాయాలు, ఆధునిక యంత్రాలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలను ప్రదర్శించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్) భాగస్వామ్యంతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల (ఏటీసీలు) ఏర్పాటుకు సుమారు రూ.4,000 కోట్ల విలువైన అత్యాధునిక సాంకేతిక మౌలిక సదుపాయాలు, శిక్షణా వనరులను సమకూర్చింది. టీసీల్లో చేరిన విద్యార్థులకు ప్రభుత్వం స్టైపెండ్లు కూడా అందజేస్తోందని, ఆర్థిక ఇబ్బందులు ఆధునిక నైపుణ్యాల సాధనకు అడ్డంకిగా మారకుండా చర్యలు తీసుకుంటోందని మంత్రి మిగతా 2లో..



2 లో..

## సీ'ఫుడ్ ఉత్పత్తిలో
# ఆంధ్రప్రదేశ్ రెండో స్థానం

- ఏటా 197 లక్షల మెట్రిక్ టన్నుల సీ'ఫుడ్ ఉత్పత్తి • బ్లూ ఎకానమి పెరిగితే దేశ ప్రగతికి దోహదపడుతుంది • సముద్ర ఉత్పత్తులకు కేంద్రం సహకారం ఉండాలి • నేషనల్ సీఫుడ్ ఎక్స్‌పోర్ట్స్ వర్క్‌షాపులో సిఎం చంద్రబాబు • ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విశాఖలో సైకిల్ తొక్కిన చంద్రబాబు
- ఏయు గ్రౌండ్స్ నుంచి నోవాటెల్ వరకు సైకిల్ సవారీ

సంపుటి: 2 సంచిక: 17 వార్త వేదిక సూర్య || శనివారం, 6 జూన్, 2026 ||

# భారత్‌కు సుఖోయ్ ఎస్‌యూ 57లను ఇస్తాం

- వాటిని భారత్‌లో తయారుచేసేందుకూ సిద్ధమే
- రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటన

మాస్కో, జూన్ 5: తమ అత్యాధునిక సుఖోయ్ ఎస్‌యూ–57 స్టెల్త్ యుద్ధ విమానాలను భారత్‌కు విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నామని రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. భారత్ కోరితే ఈ ఐదోతరం యుద్ధ విమానాలను భారత్‌లోనే సంయుక్తంగా తయారు చేసేందుకు కూడా సిద్ధమేనని తెలిపారు. గురువారం రాత్రి ఆయన అంతర్జాతీయ మీడియాతో మాట్లాడారు. 'ఈ యుద్ధవిమానాలను కలిసి తయారు చేద్దామని భారత్‌లోని మా మిత్రులకు సూచించాం. వాళ్లు ఈ విషయాన్ని పరిశీలిస్తామని చెప్పారు' అని వెల్లడించారు. స్టెల్త్ యుద్ధ విమానాన్ని సొంతంగా తయారుచేసేందుకు మనదేశం చేపట్టిన ఏఎంసీఏ ప్రాజెక్టు 2035 దాకా పూర్తయ్యే అవకాశం లేనందున.. రష్యా నుంచి కనీసం రెండు స్క్వాడ్రన్ల (36 విమానాలు) ఎస్‌యూ–57 ఫైటర్ జెట్లను కొనుగోలు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. అయితే, భారత వాయుసేన రఫేల్ యుద్ధ విమానాలవైపు ఎక్కువగా మొగ్గుచూపుతోంది. కాగా, భారత్–చైనా మధ్య సరిహద్దు సహా పలు అంశాలపై ఉన్న సున్నితమైన వివాదాల్లో తాము జోక్యం చేసుకోబోమని పుతిన్ తెలిపారు. సమస్యలను మోదీ, జిన్‌పింగ్ కలిసి పరిష్కరించుకోగలరని పేర్కొన్నారు.

# ఆ 40 లక్షల టన్నుల బొగ్గు ఎక్కడుంది?

హైదరాబాద్, జూన్ 5 (వార్త వేదిక సూర్య):

'సింగరేణి అధికారిక వెబ్‌సైట్ రికార్డుల్లో పేర్కొన్న 40 లక్షల టన్నుల బొగ్గు ఎక్కడుంది? కోల్ స్టాక్ పాయింట్ల దగ్గర కనిపించని ఆ బొగ్గు ఏమైంది? సింగరేణిలో రూ.1600 కోట్ల ఈ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి నిగ్గు తేల్చండి' అంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కిషన్‌రెడ్డికి లేఖ రాశారు. 40 లక్షల టన్నుల బొగ్గుమీద కోల్ సెస్‌తోపాటు, ఆదాయపు పన్ను కూడా కట్టామని లెక్కలు చూపిస్తున్నా, క్షేత్రస్థాయిలో బొగ్గు లేకపోవడం వెనక ఎవరి హస్తం ఉందో తేల్చాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డితో మిలాఖత్ లేకుంటే.. తక్షణం ఈ కుంభకోణంపై విచారణ జరిపించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# యువతకు ఉపాధి అవకాశాలు

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలకు అనుగుణంగా శిక్షణా సంస్థలను ఆధునీకరించడం ద్వారా భవిష్యత్ పరిశ్రమల అవసరాలను తీర్చగల అత్యున్నత నైపుణ్యాలున్న మానవ వనరులు సిద్ధమవుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం తెలంగాణ యువత ఉపాధి అవకాశాలను పెంపొందించడమే కాకుండా రాష్ట్రాన్ని దేశంలోనే నైపుణ్యాభివృద్ధి రంగంలో అగ్రగామిగా నిలబెడుతుందని అన్నారు. ఐటీఐల మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు శిక్షకులు, బోధకులకు కూడా విస్తృత స్థాయిలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తద్వారా విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన నాణ్యమైన విద్య, ప్రాక్టికల్ శిక్షణ అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నైపుణ్యవంతమైన మానవ వనరులను తీర్చిదిద్దడంలో ఏటీసీలు కీలక పాత్ర పోషిస్తాయని, తెలంగాణను దేశంలో ప్రముఖ నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా నిలబెట్టడంలో ఇవి మైలురాయిగా మారతాయని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. సందర్భంగా మల్లేపల్లి ఐటీఐ ప్రాంగణంలో ప్రత్యేక ఫోటో ప్రదర్శనతో పాటు సాంకేతిక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## జపాన్‘తెలంగాణ సహకారానికి కొత్త దిశ..

జపాన్‌లోని హిరోషిమా ప్రిఫెక్చర్‌కు చెందిన ప్రతినిధి బృందం శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు మరియు భూగర్భశాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామితో సమావేశమైంది. ఈ సమావేశాన్ని తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్) సమన్వయం చేసింది. సమావేశంలో జపాన్ ప్రతినిధులు వివిధ పరిశ్రమలు, రంగాల్లో భారత యువతకు అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాల గురించి మంత్రికి వివరించారు. తెలంగాణ?జపాన్ మధ్య నైపుణ్యాభివృద్ధి, అంతర్జాతీయ ఉపాధి అవకాశాల విస్తరణ, శిక్షణ పొందిన మానవ వనరుల అభివృద్ధి వంటి అంశాలపై పరస్పర సహకార అవకాశాలపై చర్చలు జరిగాయి. హైదరాబాద్‌తో జపాన్ నగరాల అనుబంధానికి రెండు దశాబ్దాల చరిత్ర ఉందని, ప్రస్తుతం ఆ భాగస్వామ్యం 20వ సంవత్సరాన్ని జరుపుకుంటోందని ప్రతినిధి బృందం పేర్కొంది. ఈ సందర్భంగా మంత్రి డా. వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా తెలంగాణ యువతను ప్రభుత్వం సిద్ధం చేస్తోందన్నారు. రాష్ట్ర యువతకు విదేశీ ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో, వారి ఉపాధి సామర్థ్యాలను పెంపొందించడంలో టామ్‌కామ్ అత్యంత వృత్తిపరమైన, లక్ష్యబద్ధమైన కృషి చేస్తోందని తెలిపారు. జపాన్ సాంకేతిక నైపుణ్యం, పని సంస్కృతి తనను ఎంతో ఆకట్టుకున్నాయని మంత్రి పేర్కొన్నారు. జపాన్ యంత్రాల ఖచ్చితత్వంతో పాటు అక్కడి ప్రజల వినయం, క్రమశిక్షణ తనను ప్రభావితం చేశాయని అన్నారు. ఈ సమావేశంలో లేబర్ ఎంఎ‘లాయ్‌మెంట్ ట్రైనింగ్ అండ్ ఫ్యాక్టరీస్ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన తెలంగాణ అభివృద్ధి అవకాశాలపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు.

# పర్యావరణంతో సంబంధం లేదని అనలేం: పొన్నం

హైదరాబాద్, జూన్ 5 (వార్త వేదిక సూర్య):

ప్రపంచ పర్యావరణ దినోత్సవంతో నాకు సంబంధం లేదని ఎవ్వరూ అనుకోవద్దని హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అశోక చక్రవర్తి ఆనాడు మొక్కలు నాటారని.. ఈరోజు కూడా అది జ్ఞాపకం చేసుకుంటామని అన్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటాలని కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కృష్ణకాంత్ పార్క్‌లో హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మొక్కలు నాటారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రజాపాలన ‘ ప్రగతి ప్రణాళిక 99 రోజుల్లో భాగంగా 12 రోజుల పాటు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఢిల్లీ కాలుష్యపు కోరల్లో చిక్కుకుందని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లో అలాంటి పరిస్థితి రావొద్దని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు. వాహనాల వాడకం వల్ల పొల్యూషన్‌ను తగ్గించి పర్యావరణాన్ని కాపాడొచ్చన్నారు. భవిష్యత్తులో వర్షాలు రాకుండా ఉండే పరిస్థితి ఏర్పడుతుందని.. అందరూ నీటిని ఆదా చేయాలని సూచించారు. బోర్లు వేస్తే నీరు వచ్చే పరిస్థితులు లేవన్నారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి ఇంట్లో మొక్కలు నాటుకోవాలని కోరారు. ఎ‘లాస్టిక్‌ను నియంత్రించాలని అన్నారు. భూమిలో కలిసి పోయే వ్యర్థాలను వాడితే మంచిదని మంత్రి పొన్నం పేర్కొన్నారు.

## కేసీఆర్.. రాసిపెట్టుకోండి

# మళ్లీ మొలకెత్తనివ్వం



(మొదటి పేజీ తరువాయి)

పెదదామని, ఒకవేళ ఆ చర్చలో తాను ఓడిపోతే అసెంబ్లీ సాక్షిగా కేసీఆర్‌కు క్షమాపణలు చెబుతా నని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ''రెండున్నరేళ్లలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.22 వేల కోట్లు ఖర్చు చేశా. ఒక్క పాలమూరు జిల్లా ప్రాజెక్టులకే రూ.8 వేల కోట్లు కేటాయించా. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 15 లక్షల రేషన్ కార్డులు ఇచ్చాం. 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత కరెంట్ ఇస్తున్నాం. ఉచిత బస్సు పథకం కింద ఆర్టీసీకి రూ.10 వేల కోట్లు చెల్లించాం. మహిళా సంఘాలకు బస్సులు, పెట్రోల్ బంక్‌లు ఇచ్చాం. ఉచిత ప్రయాణమే కాదు.. బస్సులకు యజమానులను చేశాం. 67,600 ప్రభుత్వ నియామకాలు చేపట్టాం. లెక్కల్లో అనుమానాలుంటే తేదీ నిర్ణయిస్తే వచ్చి లెక్క చెబుతా. 25.35 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేశాం. సన్నధాన్యం పండించిన రైతులకు రూ.500 బోనస్ ఇస్తున్నాం. రెండున్నరేళ్లలో రూ.27 వేల కోట్లు రైతు భరోసా కింద ఖాతాల్లో జమ చేశాం. ఒక్క వ్యవసాయ రంగానికే రూ.1.50 లక్షల కోట్లు వెచ్చించాం'' అని వివరించారు. తాడు, బొంగరం లేని బిల్లా రంగాలను వదిలాడని, వారిద్దరికే పొసగడం లేదని, వారు తన పాలనపై ఏం మాట్లాడతారని ఎద్దేవా చేశారు. ప్రజలు ఇచ్చిన ధైర్యంతో గల్లీలో ఉండే కేడీతోనైనా, ఢిల్లీలో ఉండే మోడీతోనైనా కొట్లాడతానని స్పష్టం చేశారు. కేసీఆర్‌ను మేకవన్నె పులి అని గుర్తించక రెండుసార్లు ముఖ్యమంత్రి చేశామన్నారు. దొంగలకు సద్దులు మోసేవారితో జాగ్రత్తగా ఉండాలని, మనవారైనా అప్రమత్తత అవసరమని వ్యాఖ్యానించారు. వనపర్తిలో ఒకరు, పాలమూరులో ఒకరు మోపయ్యారని విమర్శించారు. గోదావరి జలాల్లో జరిగిన అన్యాయంపై మహారాష్ట్ర సీఎంను నిలదీస్తామని, చర్చలకు రమ్మంటే దాగుడుమూతలు ఆడుతున్నారని, రాష్ట్ర బీజేపీ నేతలు మర్యాదగా ఆయనను చర్చలకు తీసుకురావాలని, లేకపోతే తెలంగాణ నుంచి తరమడం ఖాయమని హెచ్చరించారు. సభలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# ప్రాజెక్టులపై ఏపీతో చర్చల్లో సత్ఫలితాలు

మహబూబ్‌నగర్, (వార్త వేదిక సూర్య)–జూన్ 5:

''బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీలు కేటాయిస్తే.. అందులో తెలంగాణకు 299 టీఎంసీలు చాలంటూ కేసీఆర్ రాసిన మరణ శాసనం సంక్లిష్టంగా మారింది. దానిని తొలగించే ప్రయత్నం చేస్తున్నాం. ప్రాజెక్టులపై పక్క రాష్ట్రంతో చర్చలు జరుగుతున్నాయి. సత్ఫలితాలు రాబోతున్నాయి. త్వరలో మంచి వార్తలు వినిపించ బోతున్నాం. 90 టీఎంసీల పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, 20 టీఎంసీల డిండి ఎత్తిపోతల పథకానికి నికర జలాలు ఇవ్వడానికి సమ్మతి తెలిపి.. ఎన్వోసీ ఇస్తేనే తదుపరి చర్చలు ఉంటాయి'' అని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కృష్ణా, గోదావరి జలాల్లో న్యాయమైన వాటా నుంచి ఒక్క చుక్క నీటిని కూడా వదులుకోబోమని స్పష్టం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం కరివెన రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరితో కలిసి ఆయన మాట్లాడారు. గోదావరిలో తెలంగాణకు 968 టీఎంసీల నీటి కేటాయింపులున్నాయని, ఆ మేరకు ప్రాజెక్టులు కట్టుకోవడానికి అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ''తెలంగాణ లో ప్రాజెక్టులు కట్టుకొని వాడుకున్న తర్వాత మిగిలిన నీళ్లు తీసుకొని పోతారా..? గోదావరి నుంచి బనకచర్లలో పోసుకుంటారా..? అది మన సమస్య కాదు. పక్కింట్లో కోడి కూర వాసన వస్తోందని ఆ ఇంట్లో బురదపోయం. కేసీఆర్‌లాగా చిల్లర మాటలు.. తొడలు గొట్టుడు.. మరచిపోవడం మాకు అలవాటు లేదు. మతి తప్పిన మాటలు మాట్లాడబోం. జల వివాదాలు పరిష్కరించుకోవడం కేసీఆర్‌కు ఇష్టం లేదు. పంచాయితీ కావాలా..? పరిష్కారం కావాలా అని నన్నడిగితే పరిష్కారం కోరుకుంటా. చర్చల ద్వారా సమస్యలన్నీ పరిష్కరిస్తాం. అందుకు చివరి నిమిషం దాకా ప్రయత్నిస్తాం'' అని వివరించారు. కృష్ణా జలాల వివాదం 60 ఏళ్లుగా రావణకాష్టంలా రగులుతోందని, ఈ సమస్య పరిష్కరించుకొని నీటి వాటాలు సాధిద్దామంటే కేసీఆర్ అడ్డుపడుతున్నారని సీఎం రేవంత్ ఆరోపించారు. ''జలవివాదాల పరిష్కారం కోసం పక్క రాష్ట్రంతో చర్చలు జరుపుతుంటే బురద చల్లడానికి రెడీగా ఉంటారు. బురద చల్లినా, అడ్డుపడినా పక్క రాష్ట్రంతో చర్చలు జరిపి పాలమూరుకు 90 టీఎంసీలు, డిండికి 20–30 టీఎంసీలు నీటి వాటా సాధిస్తా'' అని స్పష్టం చేశారు. జిల్లా ప్రజలు అందించిన సహకారానికి కృతజ్ఞతగా కేసీఆర్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి చేస్తారని ఆశించామని, అధికారంలో ఉన్న పదేళ్లలో ప్రాజెక్టులపై రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేస్తే.. ఇందులో లక్ష కోట్లు ఒక్క కాళేశ్వరంపైనే పెట్టారని సీఎం రేవంత్ రెడ్డి తప్పుబట్టారు. పాలమూరు–రంగారెడ్డి పథకానికి రూ.27 వేల కోట్లు వెచ్చించినా.. పంపులు, లిఫ్టుల్లోనే ఆ డబ్బులను ఖర్చు పెట్టారని తెలిపారు. కేసీఆర్ ఇంట్లో కనక వర్షం కురుస్తుంది కాబట్టే పంపులు, లిఫ్టులకే పెట్టారని ఆరోపించారు. ''ఎలక్ట్రికల్ మెకానిక్ కాంపోనెంట్‌లో నిధులు వెచ్చిస్తే 20, 30 శాతం మామూళ్లు వస్తాయి. అందుకే సివిల్ వర్కులకు నిధులు ఇవ్వలేదు. ఉన్నదంతా దోచుకొని పోయారు. పంపులు, లిఫ్టులకు వేల కోట్లు బిల్లులు చెల్లించి.. కోట్లు కొట్టేశారు. జూరాల మినహా జిల్లాలో అన్ని ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ అవినీతిపై నాగం జనార్దన్ రెడ్డి సుప్రీంకోర్టు దాకా వెళ్లి కొట్లాడారు'' అని వివరించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 26 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చేవని తెలిపారు. పాలమూరు నిర్మాణ అంచనా వ్యయం రూ.57 వేల కోట్లలో రూ.27 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేస్తే.. 90 శాతం పనులు పూర్తయినట్లు ఎలా అవుతుందని నిలదీశారు. అధికారంలోకి వచ్చిన 30 నెలల్లో అసలు కింద రూ.33 వేల కోట్లు, వడ్డీ కింద రూ.18,554 కోట్లు.. వెరసి పాపాల భైరవుడు అందించిన అప్పులకు రూ.52,121 కోట్లు తాము కట్టామని, ప్రాజెక్టుల నిర్మాణ పనులకు రూ.22 వేల కోట్లు చెల్లిస్తే.. అందులో రూ.8 వేల కోట్లను పాలమూరు–రంగారెడ్డి పథకానికే వెచ్చించామని ప్రకటించారు. గతంలో విపరీతమైన అప్పులు తేవడం వల్ల.. నిజంగా అవసరమున్నా అప్పులు తెచ్చుకునే పరిస్థితి లేకుండాపోయిందని వ్యాఖ్యానించారు. ''కేసీఆర్ అంటే నీళ్లు.. నీళ్లంటే కేసీఆర్ కాదు. సారా అంటే కేసీఆర్. ఆయన చేసిందంతా పేరు, ఊరు, అంచనాలు మార్చడం తప్ప సొంతంగా ఏ ప్రాజెక్టునూ చేపట్టలేదు'' అని విమర్శించారు. రాబోయే రెండేళ్లలో జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణ పనులన్నీ పూర్తి చేస్తామని సీఎం రేవంత్ ప్రకటించారు. రాబోయే రోజుల్లో వేగంగా భూసేకరణ పనులు చేస్తామని, ఇందుకు సహకరించాలని కోరారు. తక్కువ భూసేకరణతో నీళ్లు ఎక్కువగా నిల్వ చేసే ప్రాజెక్టులు కడతామన్నారు. కృష్ణా, బీమా నదులపై చిన్న చిన్న బ్రిడ్జి కమ్ బ్యారేజీలు కడతామని, కర్ణాటక, తెలంగాణ సరిహద్దుల్లో నీటి నిల్వకు బ్యారేజీలు కట్టుకోనున్నామని వెల్లడించారు. కర్ణాటకలోనూ కాంగ్రెస్ ప్రభుత్వమే ఉందని, సంయుక్తంగా ప్రాజెక్టులు కట్టుకుంటామని తెలిపారు. ఉదండాపూర్ దాకా పనులను 2027 జూన్‌కల్లా పూర్తిచేస్తామని ప్రకటించారు. అక్కడి నుంచి లక్ష్మీదేవిపల్లికి నీటిని తరలించే అంశంపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం బెంగుళూరుకు వెళ్లనున్నారు. ఓ మీడియా సంస్థ నిర్వహించే కాన్క్లేవ్ లో పాల్గొంటారని తెలిసింది. సాయంత్రానికి తిరిగి హైదరాబాద్ చేరుకుని, కోహెడ మార్కెట్ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరవుతారు. కాగా, ఈనెల 10న ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కోసం నిర్మించిన 'ఎఫ్‌సీడీఏ' భవనాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం అనంతరం సాయంత్రం బహిరంగ సభ నిర్వహించే అవకాశం ఉంది.

# సీ‘ఫుడ్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానం

విశాఖపట్టణం, (వార్త వేదిక సూర్య)–జూన్5:

భారతదేశంలో సీ‘ఫుడ్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రతి ఏటా 197 లక్షల మెట్రిక్ టన్నుల సీ‘ఫుడ్ ఏపీ నుంచి ఉత్పత్తి అవుతోందని పేర్కొన్నారు. ఏపీలో బ్లూ ఎకానమి పెరిగితే దేశ ప్రగతికి దోహదపడుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. విశాఖలో సీ‘ఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్‌షాప్ ఘనంగా ప్రారంభమైంది. సీఎం చంద్రబాబు నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆక్వా ఉత్పత్తుల నాణ్యతను పెంచుతామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. దేశంలోని మత్స్యసంపదలో 28 శాతం ఏపీ నుంచే వస్తోందని చెప్పారు. విశాఖపట్నంలో 'నేషనల్ సీఫుడ్ ఎక్స్‌పోర్ట్స్'పై నిర్వహించిన వర్క్‌షాప్‌లో కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. సముద్ర ఉత్పత్తుల ఎగుమతులను పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. పదేళ్లలో 5 శాతం నుంచి 70 శాతం పెరుగుదల కనిపించింది. తక్కువ వ్యవధిలో ఎక్కువ ఉత్పత్తులను ఎగుమతి చేసే స్థాయికి వెళ్లాం. ఆక్వా ఉత్పత్తుల ఎగుమతిలో దేశంలో ఏపీదే అగ్రస్థానం. రొయ్యల ఉత్పత్తిలో 66 శాతం, సీఫుడ్ ఆదాయంలో 38 శాతం మన రాష్ట్రం నుంచే వస్తోంది. రాష్ట్రంలో ఆక్వా ఉత్పత్తులు పెరిగేందుకు కేంద్రం అండగా నిలబడాలి. రొయ్యల ఉత్పత్తి మరింత పెరిగేందుకు ఏపీ అన్నివిధాలా అనుకూలం. విశాఖపట్నం, భీమవరం, కాకినాడ, నెల్లూరు, కృష్ణపట్నం ప్రాంతాలు ఆక్వా ఉత్పత్తి కేంద్రాలుగా ఉన్నాయి. రైతులు పొలాల్లో తీసిన కుంటలు కూడా సంపద సృష్టిస్తున్నాయి. రాష్ట్రంలో పారిశ్రామికవేత్తలకు ఎప్పుడూ డోర్లు తెరిచే ఉంటాయి. వారు ఎప్పుడైనా నన్ను కలవొచ్చు.. ఫోన్ చేసి రావొచ్చని చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా కాకినాడ పోర్టును ఆధునికీకరణ చేస్తామని కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రకటించడంపై ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర మత్స్యశాఖ ప్రాంతీయ కార్యాలయానికి అవసరమైన స్థలాన్ని 15 రోజుల్లో ఇస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. 'భారతదేశంలో మొత్తం చేపల ఉత్పత్తిలో ఏపీ వాటా 28 శాతంగా, రొయ్యల ఉత్పత్తిలో 66 శాతంగా ఉంది. దేశ సముద్రపు ఆహార ఎగుమతుల్లో ఏపీ నుంచే కేంద్రానికి దాదాపు 38 శాతం ఆదాయం వస్తోంది. సంవత్సరానికి రూ.28,000 కోట్లకు పైగా సీ‘ఫుడ్ ఎగుమతులు ఏపీ నుంచే జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందితే భారతదేశ సముద్ర ఆహార ఎగుమతులూ అభివృద్ధి చెందుతాయి. ఆక్వా రంగంలో ఏపీ ఆవిష్కరణలు చేస్తే భారతదేశ బ్లూ ఎకానమి నిస్సందేహంగా ముందుకు సాగుతుంది. ప్రపంచవ్యాప్తంగా జరిగే సీ‘ఫుడ్ బిజినెస్‌లో భారత్ వాటా కేవలం 5 శాతం మాత్రమే. ఈ రంగంలో దేశానికి పెద్దఎత్తున అవకాశాలు ఉన్నాయి. బ్లూ ఎకానమి ద్వారా ఆర్థిక వృద్ధి సాధ్యం. నీరు ఉన్న చోట నాగరికతలు విలసిల్లుతాయి. ఏపీలో గోదావరి, కృష్ణ వంటి జీవనదులు ఉన్నాయి. భవిష్యత్ అంతా బ్లూ ఎకానమిదే' అని పేర్కొన్నారు. Sగా, ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబుతో పాటు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, చిరాగ్ పాశ్వాన్, రాజీవ్ రంజన్ సింగ్, మంత్రులు అచ్చెన్నాయుడు, డోలా బాల వీరాంజనేయస్వామి, ఎంపీ బీద మస్తాన్ రావు పాల్గొన్నారు.

## విశాఖలో సైకిల్ తొక్కిన చంద్రబాబు

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలుగుదేశం నేతలు ఉత్సాహంగా సైకిలెక్కారు. చంద్రబాబు సహా నేతలంతా సైకిల్ తొక్కి పర్యావరణాన్ని ప్రచారం చేశారు. విశాఖలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉత్సాహంగా సైకిల్ తొక్కారు. ఐదున్నర కిలో మీటర్ల దూరాన్ని 21 నిమిషాల 18 సెకండ్లలో చేరుకున్నారు. విశాఖ ఏయు గ్రౌండ్స్ నుంచి నోవాటెల్ వరకు సీఎం సైకిల్ సవారీ చేశారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్, పోలమాంబ గుడి, వాల్తేరు, బీచ్ రోడ్ మీదుగా నోవాటెల్‌కు ముఖ్యమంత్రి చేరుకున్నారు. ఎర్రటి ఎండ కాస్తున్నా ఉత్సాహంగా సైకిల్ తొక్కారు. సైకిల్ తొక్కుతూ ప్రజలకు అభివాదం చేసుకుంటూ సీఎం సైకిల్ ప్రయాణం సాగింది. సైకిల్ ర్యాలీలో సీఎం చంద్రబాబు వెంట జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు ఉన్నారు. శ్రీకాకుళంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, విజయవాడలో హోంమంత్రి అనిత కూడా సైకిలెక్కారు. విశాఖ ఏయు గ్రౌండ్స్‌లో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ మొక్కని నాటారు. తిరుమలలో గ్రీనరీ త్వరలో 90 శాతానికి చేరుకోబోతోందని ఈ సందర్భంగా సీఎం అన్నారు. విశాఖ ఏయులో మాత్రం కేవలం 25 శాతం మాత్రమే గ్రీనరీ ఉందని.. గ్రీనరీ పెంచేలా చర్యలు తీసుకోవాలని ఏయు వీసీకి ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. మొక్కలు బాగా పెంచిన వాళ్లకే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లంటూ చంద్రబాబు సరదా వ్యాఖ్యానించారు. ఆంధ్రా యనివర్సిటీని ఆదర్శంగా తయారు చేయాలని అన్నారు. చరిత్ర గల యనివర్సిటీ.. ఎంతోమంది నాయకులు, విద్యావేత్తలు, ప్రముఖులను అందించిందని తెలిపారు. నెట్ జీరో కాన్సెప్ట్‌ను ఏయులో ప్రవేశపెడుతున్నట్లు సీఎం చెప్పారు. వాతావరణ మార్పులపై అందరూ దృష్టి సారించాలన్నారు. యనివర్సిటీకి కావాల్సిన 100శాతం విద్యుత్ ఇక్కడి నుంచే ఉత్పత్తి చేయాలన్నారు. యనివర్సిటీ క్యాంపస్‌లో చెట్లను పెంచాలన్నారు. పిల్లలకు ఎక్స్‌పీరియన్స్ సెంటర్లుగా యనివర్సిటీలను మార్చాలన్నారు. ఆంధ్రా యనివర్సిటీలో కమిటీ ఆఫ్ ప్రొఫెసర్స్‌ను పెట్టి ఇన్‌హౌస్ నాలెడ్జీని అభివృద్ధి చేయాలని అన్నారు. ఆంధ్రా యనివర్సిటీ అన్ని ఇతర కాలేజీలను గైడ్ చేయాలన్నారు. యనివర్సిటీ అభివృద్ధికి బ్లూ ప్రింట్ తయారుచేస్తామని తెలిపారు. యాక్షన్ ఎ‘లాన్‌లో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. లెక్చరర్స్, స్టూడెంట్స్ అందరూ ఇందులో భాగస్వామ్యం కావాలన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా తాను కూడా సైకిల్ మీద వెళ్తున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. ఫొటోల కోసం కాదని.. ఒక అలవాటు కావాలనే ఉద్దేశంతోనే సైకిల్‌పై వెళ్తున్నట్లు తెలిపారు.

# నీటమునిగి 8 మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)

చెందిన తల్లీకూతుళ్లు అనిత(40), శివాని(13) మృతిచెందారు. మరో బాలుడు భానుప్రసాద్ పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. నిజామాబాద్ జిల్లా భీంగల్ పట్టణంలో కుంటలో పడి ముగ్గురు చిన్నారులు మృతి చెందారు. లింబాద్రి గుట్ట వద్ద గల వడ్డెర కాలానికి చెందిన హరీష్(11), కుమార్తె వర్షిణి (5), అరవింద్(4) ఆడుకునేందుకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల గాలించారు. బ్రాహ్మణ కుంట వద్ద చిన్నారుల దుస్తులు కనబడడంతో గజ ఈతగాళ్లతో గాలించగా ముగ్గురు చిన్నారుల మృతదేహాలు బయటపడ్డాయి. చిన్నారుల తల్లిదండ్రులు కూలి పనులు చేస్తుంటారని స్థానికులు తెలిపారు. అన్నాచెల్లెలు హరీష్, వర్షిణి మృతితో కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి. దర్యాప్తు కొనసాగుతోంది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం కిష్టంపల్లి గ్రామం సమీపంలోని చెరువులో ఈతకు దిగి ప్రమాదవశాత్తూ ఇద్దరు బాలురు మృతి చెందారు. జడ్చర్ల మునిసిపాలిటీలోని ఎర్రసత్యం కాలనీకి చెందిన సోయల్(13), అబ్దుల్‌రహమన్(14) కిష్టంపల్లి చెరువులో ఈత కొట్టేందుకు దిగి మునిగిపోయారు. గాలింపు చర్యల్లో ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి.



# చేనేత కళాకారులకు ప్రోత్సాహం అందాలి

(మొదటి పేజీ తరువాయి)

ఖ్యాతిని, ఉత్పత్తులను వినియోగదారుడి చెంతకు చేర్చేందుకు కలెక్టర్ అనురాగ్ జయంతి చేస్తున్న కృషిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ వస్త్ర ప్రదర్శనకు మరింత మంది ప్రజాప్రతినిధులు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, చేనేత కళాకారులకు తగిన ప్రోత్సాహం అందించాలని సూచించారు.పోచంపల్లి రుమాళ్లు, ఇక్కత్ చీరలకు మరింత ప్రాచుర్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. వస్త్ర ప్రదర్శన ద్వారా చేనేత కార్మికులకు మార్కెటింగ్ అవకాశాలు పెరుగుతాయన్నారు. ఈ సభలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ అనురాగ్ జయంతి, కళాత్మక చేనేత వస్త్రాల రూపశిల్పులు పద్మశ్రీ పురస్కార గ్రహీతలు గజం గోవర్ధన్, గజం అంజయ్య తదితరులు పాల్గొన్నారు. ఎగ్జిబిషన్ స్టాల్స్‌లోని ఇక్కత్, తదితర చేనేత వస్త్రాలు, ఇతర ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకున్నాయి.

# అర్ధరాత్రి ఇంట్లో పేలిన సిలిండర్

- అమ్మమ్మతో పాటు

ఇద్దరు మనవళ్ల మృతి

నల్లగొండ, జూన్ 5 (వార్త వేదిక సూర్య):

నల్లగొండ జిల్లాలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. మిర్యాలగూడలోని ఓ ఇంట్లో అర్ధరాత్రి సమయంలో గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందారు. మరణించిన వారిని అమ్మమ్మ వనం చంద్రకళ, మనుమడు లక్ష్మణ్ (16), మనమరాలు ప్రణతి (14)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని కలాల్‌వాడకు చెందిన చంద్రకళ, సైదులు భార్యభర్తలు. చంద్రకళ భర్త అనారోగ్యంతో కొన్ని రోజుల కిందటే మరణించాడు. ఇక చంద్రకళ పెద్ద కూతురు ధనమ్మ భర్త పదేళ్ల కిందట చనిపోయాడు. అప్పటి నుంచి తన ఇద్దరు పిల్లలు లక్ష్మణ్ (16), ప్రణతి (14)తో పుట్టింట్లోనే ఉంటోంది. ఉపాధి నిమిత్తం ఇళ్లలో పనిచేసేందుకు ధనమ్మ మడు రోజుల కిందట పుణెళికు వెళ్లింది. ఇదిలా ఉంటే.. గురువారం రాత్రి మనుమడు, మనుమరాలితో చంద్రకళ తమ రేకుల ఇంట్లో నిద్రిస్తుండగా షార్ట్‌సర్క్యూట్ అయ్యింది. విద్యుద్ఘాతం కారణంగా ఇంట్లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఇది గమనించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా.. భారీ శబ్దంతో గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో ముగ్గురు అక్కడికక్కడే సజీవదహనం అయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం మృతదేహాలను వెలికితీశారు. డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఘటనాస్థలిని పరిశీలించి సహాయక చర్యలు చేపట్టారు. పూర్తిగా కాలిన మృతదేహాలను స్థానిక ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

సంపుటి: 2 సంచిక: 17 వార్త వేదిక సూర్య హైదరాబాద్ శనివారం, జూన్ 06, 2026



# మహిళలు స్వశక్తితో ఆర్థికంగా నిలబడినపుడే అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతారు

### ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

నల్లగొండ బ్యూరో, జూన్ 5 (వార్తా వేదిక సూర్య )

ఆత్మస్థైర్యంతో తగిన సమయంలో ప్రతిది నేర్చుకుంటే అన్ని రంగాల్లో విద్యార్థులు రాణిస్తారని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి చెప్పారు. శుక్రవారం ఎంవియన్ విజ్ఞాన కేంద్రంలో కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. పురుషులతో సమానంగా మహిళలు కూడా అన్ని రంగాలలో ముందుకు వెళ్లుతున్న కూడా నేటికి లింగవివక్షత కొనసాగుతుందన్నారు. ఉద్యోగాలకు ప్రిపరేషన్ అవుతున్న అభ్యర్థులు సమయం వృధా చేయకుండా ఇష్టంగా చదవడం ద్వారా మనం అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటామని తెలిపారు. ఏ చిన్న అవకాశం దొరికిన దానిని ఉపయోగించుకొని ఎంచుకున్న గమ్యానికి చేరుకోవాలని ఇచ్చారు. ప్రభుత్వాలు మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మహిళలను అన్ని రకాలుగా ప్రోత్సహించాలని కోరారు. మహిళలు స్వశక్తితో ఆర్థికంగా నిలబడినపుడే అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతారన్నారు. స్వయంశక్తితో ఆర్థికంగా ఎదిగినపుడే మహిళలు అన్ని రంగాలలో ముందుకు వెళుతారని తెలిపారు. ఎంవిఎన్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రజలకు అందిస్తున్న సేవలను కొనియాడారు. ప్రతి విద్యార్థిని విద్యార్థులు ఎంవిఎన్ కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో కంప్యూటర్ విద్యను నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. దీంతోపాటు యువతి, మహిళలు టైలరింగ్ తోపాటు బ్యూటీషియన్, చిన్నచిన్న వ్యాపారాల్లో నైపుణ్యం పెంచుకుంటే ఆర్థికంగా తమ కుటుంబానికి సహాయపడుతుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని అభివృద్ధిలోకి రావాలని విద్యార్థి, నిరుద్యోగ యువతకు పిలుపునిచ్చారు.

ఎంవిఎన్ విజ్ఞాన కేంద్రం కార్యనిర్వహణ కార్యదర్శి పి. నర్సిరెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సంస్థలతో పాటు చట్టసభలలో కూడా మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వాలను కోరారు. సమాజంలో నేటికి మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలతోపాటు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచేందుకు, ఆత్మ రక్షణకు కరాటేలో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. సుగర్, బిపి, మూర్ఛ, పక్షవాతం రోగులకు ప్రతినెల మూడో అధివారం మందులు ఇస్తున్నట్లు చెప్పారు. ఇంకా ఈ గ్రంధాలయాన్ని కంప్యూటర్స్‌తో కూడిన డిజిటల్ లైబ్రరీగా తీర్చిదిద్దనున్నట్లు వివరించారు. వీటితో ప్రతి సంవత్సరం ఎంఏ అర్థశాస్త్రం పీజీ ప్రవేశ పరీక్షకు డాక్టర్ అక్కెనపల్లి మీనయ్య ఆధ్వర్యంలో ఆన్లైన్ కోచింగ్ ఇస్తున్నట్లు చెప్పారు. వీటితోపాటు గ్రూపు2, బ్యాంక్ పిఓఎస్, డిఎస్సీ అభ్యర్థులకు అవగాహన కల్పించనున్నామని తెలిపారు. పేద విద్యార్థులు, నిరుద్యోగ యువతి యువకులకు, ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా తమ ట్రస్టు పనిచేస్తుందన్నారు. వేసవి కాలంలో కంప్యూటర్, కరాటే, టైలరింగ్ నేర్పించినట్లు చెప్పారు. మాసంస్థ ఇచ్చే అన్ని రకాల శిక్షణా కార్యక్రమాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్యాకల్టీ పి.శంకర్, ఐద్వా నాయకురాలు ఎం ప్రభావతి, సరోజ, అనురాధ, అరుణ పాల్గొన్నారు.

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

నల్లగొండ బ్యూరో, జూన్ 5 (వార్తా వేదిక సూర్య )



డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో మిగిలి ఉన్న అన్ని పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి లబ్ధిదారులకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన నల్గొండ లోని గొల్లగూడ డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయాన్ని పరిశీలించారు. గొల్లగూడ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో అద్దాలు, ఎలక్ట్రికల్ వైరింగ్, విండోలు, వాటర్ ట్యాంకులు, నీటి ట్యాపులు, లైటింగ్, తలుపులు, బాత్రూములు, టాయిలెట్లు, కిచెన్ గదులు, తదితర పనులను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని చెప్పారు. అలాగే గృహ సముదాయం మొత్తాన్ని శుభ్రపరచి పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని మున్సిపల్ కమిషనర్ కు ఆదేశాలు జారీ చేశారు. లబ్ధిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని , జిమ్, పార్కులు, బస్తీ దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రం, జిరాక్స్ సెంటర్, మీ సేవా కేంద్రం, మెడికల్ షాప్, కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పీడీ రాజ్ కుమార్ ఆదేశించారు. అదేవిధంగా లే అవుట్ బోర్డులు, దిశా నిర్దేశిక సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. గృహ సముదాయం పరిసర ప్రాంతాల్లో సీసీ రోడ్లు, అంతర్గత రహదారులు, వైకుంఠధామం, క్రీడా మైదానం వంటి మౌలిక వసతుల అభివృద్ధి పనులను కూడా వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం మాత్రమే కాకుండా, నివాసితులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఒకేచోట అందుబాటులో ఉండేలా సమగ్ర ప్రణాళికతో పనులు పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన వసతులు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. జిల్లా గృహ నిర్మాణ పీడి రాజ్ కుమార్ ,పంచాయతీరాజ్ ఈ ఈ గిరిధర్,కార్పొరేషన్ కమిషనర్ శరత్చంద్ర, కాంట్రాక్టర్ సైదిరెడ్డి, సంబంధిత అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# జర్నలిస్టు పిల్లలకు ప్రవేట్ పాఠశాలలో ఫీజు రాయితి ఇవ్వాలి

### టియుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి



చౌటుప్పల్ జూన్ 5 వార్తా వేదిక సూర్య

: జిల్లాలోని వివిధ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న జర్నలిస్టు పిల్లలకు ఫీజుల్లో రాయితీ ఇవ్వాలని టి యు డబ్ల్యు జె( ఐజేయు) జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.జర్నలిస్టు పిల్లలకు ప్రవేట్ పాఠశాలలో ఫీజు రాయితి ఇవ్వాలని కోరుతూటి యు డబ్ల్యు జె( ఐజేయు)ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా విద్యాశాఖఅధికారి సుశీంద్రరావు రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేయుచున్న జర్నలిస్టు పిల్లలు వివిధ ప్రవేట్ పాఠశాలలో చదువుతున్నారని ప్రవేటు పాఠశాలలో వేలాది రూపాయలు ఫీజులు చెల్లించాల్సి ఉండటంతో ఆ ఫీజులను చెల్లించలేక చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రవేట్ పాఠశాలల యాజమాన్యం వారు ఫీజులు చెల్లించాలని వత్తిడి చేయడంతో కొందరు విద్యార్థిని విద్యార్థులు ఫీజులు చెల్లించలేక మధ్యలోనే విద్యను మధ్యలోనే నిలిపి వేస్తున్నారని అన్నారు.జర్నలిస్టు కుటుంబంలోని ఒకరికి పూర్తి రాయితిని, ఇంకొకరికి 50%, మరొకరి 30% రాయితీని ఇతర జిల్లాలో కల్పించడం జరుగుచున్నదని జిల్లాలోని జర్నలిస్టు పిల్లలకు 75% ఫీజు రాయితీని కల్పించాలని కోరారు. అదేవిధంగా వెంటనే ప్రవేట్ పాఠశాలల యాజమాన్యాలకు తగిన ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. డీఈఓ కు వినతిపత్రం అందజేసిన వారిలో ఆసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు పరమేష్ , సంఘం నాయకులు మాదరి యాదగిరి, ఎర్రెడ్ల చంద్రశేఖర్ రెడ్డి, చిన్న పత్రికల సంఘం జిల్లా అధ్యక్షులు అబ్బోజు మదనాచారి, గౌరవ అధ్యక్షులు గంగాధర వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పిట్టల రామకృష్ణ , కోశాధికారి పొట్టుముత్తు అశోక్, జర్నలిస్టులు వంగాల శ్రీనివాసరెడ్డి, తెల్లమళ్ల దశరథ, ఎండి సయ్యద్, ఉయ్యాల లింగయ్య డిఎస్ యాదవ్,దొటి శ్రీనివాస్, సోమ చంద్రశేఖర్ , వుర రమేష్ , ఎస్ రాంప్రసాద్ , టి శంకర్ పాల్గొన్నారు.

# మాదిగలు అన్ని రంగాల్లో అత్యున్నత స్థాయికి ఎదగాలి



### ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు డా. గోవిందు నరేష్ మాదిగ

చౌటుప్పల్ జూన్ 5 వార్తా వేదిక సూర్య

వివరణ తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగి ఉన్న మాదిగలు విద్యా సామాజిక ఆర్థిక వ్యాపార సంక్షేమ రంగాలతో పాటు ప్రధానంగా రాజకీయ రంగంలో అత్యున్నత స్థాయికి ఎదగాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు డా. గోవిందు నరేష్ మాదిగ అన్నారు. చౌటుప్పల్ మండల కేంద్రంలో ఇటీవల చౌటుప్పల్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా రెండవసారి ఎన్నికైన మాదిగ సామాజిక వర్గానికి చెందిన యువ నాయకుడు బోయ దేవేందర్ గారిని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శాలువా కప్పి పూలదండ వేసి సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గోవిందు నరేష్ మాదిగ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ వల్లనే మాదిగలకు రాజకీయంగా గుర్తింపు లభించిందని అన్నారు అన్ని రాజకీయ పార్టీలు మాదిగలను గుర్తించగలిగేలా వారికి తగిన ప్రాతినిధ్యం ఇచ్చేలా మందకృష్ణ మాదిగ తన పోరాటాన్ని ముందుకు నడిపించాలని కొనియాడారు ఈ క్రమంలో చిన్నతనం నుండే తండ్రి స్ఫూర్తితో బోయ దేవేందర్ నిస్వార్థమైన ప్రజాసేవకుడిగా నిరంతరం ప్రజల్లో అంటూ అనేక ఉద్యమాల్లో పాలు పంచుకోవడం జరిగింది. క్రమశిక్షణ , విధేయత, ప్రజలకు సేవ చేయాలనే తపన , సమర్థత మొదలగు లక్షణాలను పుణికిపుచ్చుకొని బోయ దేవేందర్ గారు రాజకీయంగా ముందుకు సాగుతుండడం వలన రెండవ సారి మండల అధ్యక్షుడుగా అవకాశం వచ్చిందని అన్నారు. పదవిని సమర్థవంతంగా నిర్వహించి మంచి పేరు తెచ్చుకొని ఇంకా అత్యున్నత స్థాయికి బోయ దేవేందర్ ఎదగాలని ఆకాంక్షించారు. మాదిగలు వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జాతికి సేవ చేయాలని, జాతి అన్ని రంగాల్లో ఎదగడానికి తమ వంతు పాత్రను పోషించాలని అన్నారు. అలాగే జాతికి కన్నా తల్లిలాగా నిలబడిన ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి నిత్యం అండగా నిలబడాలని , మూడు దశాబ్దాల పైగా జాతిని ముందుకు నడిపిస్తున్న ' పద్మశ్రీ ' మందకృష్ణ మాదిగను మర్చిపోవద్దని కోరారు.

ఈ కార్యక్రమాన్ని వీఠూా జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య,

మాదిగ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర నాయకులు ఊదరి వెంకటేష్ మహాజన్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బోడ్డు శ్రవణ్ కుమార్, కౌన్సిలర్ చింతల ఉమామహేశ్వరి సాయిలు,ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు బోయ రాము, మాదిగ జర్నలిస్టు ఫోరం మండల అధ్యక్షులు ఆరుట్ల లింగస్వామి, ఎమ్మార్పీఎస్ మండల సహాయ కార్యదర్శి బొడ్డు గణేష్, ఎమ్మార్పీఎస్ కోయిలగూడెం గ్రామ శాఖ అధ్యక్షులు ఊదరి భాస్కర్, బోదుల స్వామి, చెక్క లింగస్వామి, బీసీ సంఘం నాయకులు వీరమల్ల సత్తయ్య, బుడగ జంగాల నాయకులు ప్రభు తదితరులు పాల్గొన్నారు

# పరిశ్రమ ఆధ్వర్యంలో 53వ ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు




చౌటుప్పల్ జూన్ 5 వార్తా వేదిక సూర్య

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని దివిస్ లేబరేటరీస్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ వాతావరణ మార్పులు నివారణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో వివిధ కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు దివిస్ పరిశ్రమ ఉపాధ్యక్షులు ఎస్ రామకృష్ణ, మరియు జి హేమంత్ కుమార్ అధ్యక్షత వహించారు. వాతావరణ మార్పుల నివారణకు మన చర్యలు అనే అంశంపై ఉద్యోగులందరూ ప్రతిజ్ఞ చేసి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు నిబద్ధతను చాటుకున్నారు. ఈ సందర్భంగా పర్యావరణ హిత జీవన విధానాలను ప్రోత్సహించే పది ఎకో లైఫ్ స్టైల్స్ అంశాలతో రూపొందించిన అవగాహన కరపత్రాన్ని దివిస్ పరిశ్రమ ఉపాధ్యక్షులు ఎస్ రామకృష్ణ ఆవిష్కరించారు. అనంతరం పరిశ్రమ ఉద్యోగుల ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పర్యావరణ జీవనశైలిని అలవర్చుకోవాలని విస్తృత స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. దివిస్ పరిశ్రమ పర్యావరణ పరిరక్షణ విభాగానికి చెందిన అసిస్టెంట్ జనరల్ మేనేజర్ డి వి రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో పర్యావరణ అవగాహన ప్రదర్శన స్టాల్ ఏర్పాటు చేయబడినది. ఈ స్టాల్ లో దివిస్ ఉద్యోగులు రూపొందించిన పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన వివిధ నమూనాలు ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. అనంతరం "జుఖ్రావస ఝుు నెవ ఝుఎ"కార్యక్రమంలో భాగంగా దివిస్ పరిశ్రమ ఆవరణలో భారీ స్థాయిలో మొక్కలు నారడం జరిగినది ఈ కార్యక్రమం Ministry of Environment, Forest and Climate Change ( MOEF&CC ) న్యూఢిల్లీ సూచనల మేరకు నిర్వహింపబడినది ఈ ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమాల లో దివిస్ పరిశ్రమ ఉపాధ్యక్షులు ఎస్ రామకృష్ణ, జి హేమంత్ కుమార్ జనరల్ మేనేజర్లు జి బాలకిషోర్, పి సుధాకర్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ డివి రాఘవేంద్రరావు ఇతర అధికారులు మరియు ఉద్యోగులు పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం..చిట్యాల బస్టాండ్ వద్ద మొక్కలు నాటిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నల్లగొండ బ్యూరో, జూన్ 5 (వార్తా వేదిక సూర్య )



ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని బస్టాండ్ వద్ద మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పిలునిచ్చారు. ఈ సందర్భంగా పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు అందరూ ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపాలిటీ చైర్మన్ పందిరి గీతా రమేష్, వైస్ చైర్మన్ గుండెబోయిన లక్ష్మి సైదులు, కమిషనర్, స్థానిక కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భారత ప్రధాని 12 సంవత్సరాల సుపరిపాలన అందించిన వ్యక్తి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ





చౌటుప్పల్ జూన్ 5 వార్తా వేదిక సూర్య

భారత ప్రధానమంత్రి మోడీ 12 సంవత్సరాలు సుదీర్ఘ పరిపాలన అందించిన వ్యక్తి ప్రధానమంత్రి మోడీ బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి అన్నారు. గురువారం ఈ సందర్భంగా చౌటుప్పల్ లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి లో ఎక్కువ కాలం పని చేసిన ఘనత కేవలం నరేంద్ర మోడీకే దక్కిందన్నారు నరేంద్ర మోడీ తీసుకున్న నిర్ణయాలకు ప్రజలు కట్టుబడి ఉండి దేశానికి సహకరించాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఖాళీ స్థలాలలో మరియు వ్యవసాయ భూములలో తల్లి పేరు పై ఒక మొక్కను పెంచాలని వారు ఈ సందర్భంగా తెలిపారు. చౌటుప్పల్ మున్సిపల్ 18 వ వార్డులో మొక్కలు నాటారు. నరేంద్ర మోడీ ఈ దేశంలో ప్రజల చేత ఎన్నుకోబడి అత్యధిక కాలం ప్రధానమంత్రిగా కొనసాగిన వ్యక్తి గతంలో నెహ్రూ నామినేటెడ్ గా వచ్చి పరిపాలించిన వ్యక్తి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అట్టడుగున ఉన్న వర్గాలకు సంక్షేమ పథకాలు అందాలనే సంకల్పంతో నిరంతరం కృషి చేస్తూ అలుపెరుగని కారణజన్ముడు నరేంద్ర మోడీ ఈ దేశం కోసం క్లిష్టమైన అసాధ్యం అనుకున్న వాటిని సుసాధ్యం చేసి అమలు చేసిన వ్యక్తి ప్రపంచంలో అత్యున్నత గౌరవం పొందిన ఏకైక వ్యక్తి నరేంద్ర మోడీ ప్రపంచంలో అనేక దేశాలు సంక్లిష్ట పరిస్థితుల ఉన్న భారతదేశ మాత్రం సుభిక్షంగా ప్రశాంతంగా ఉన్నదంటే నరేంద్ర మోడీ ఉన్నారన్న ధీమా భారత ప్రజలు మర్చిపోవద్దు కాబట్టి మోడీ తీసుకున్న నిర్ణయానికి మద్దతు పలుకుతూ వారి 12 సంవత్సరాల సుపరిపాలనకు మద్దతుగా ఈ నెల 21వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమంలో యువత పాల్గొనాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూడల భిక్షం గౌడ్ మున్సిపల్ అధ్యక్షులు కడారి కల్పన ఐలయ్య యాదవ్ రూరల్ అధ్యక్షులు కైరం కొండ అశోక్ 2 వ వార్డు కౌన్సిలర్ పోలపల్లి లక్ష్మీ ముత్తయ్య 18 వ వార్డు బుడ్డ సురేష్ జిల్లా నాయకులు రమణ గోని శంకరయ్య బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 12 సంవత్సరాల సుపరిపాలన కార్యక్రమాల మున్సిపల్ కన్వీనర్ కడారి ఐలయ్య యాదవ్ రూరల్ కన్వీనర్ యాస అశోక్ రెడ్డి దిండు భాస్కర్ ఊడుగు వెంకటేశం గౌడ్ పబ్బు వంశీ వంగాల రమాకాంత్ గుర్రం రవీందర్ వరగంటి భాను బొల్లమోని శ్రీశైలం పర్ని శేఖర్ రెడ్డి కానుగు కొండల్ కానుగు శేఖర్ ఉ ష్కాగుల నాగరాజు కాసోజు కనకాచారి కాసోజు గోపి తేలుకుంట్ల శ్రీధర్ గౌతమ్ మరియు సీనియర్ నాయకులు బూత్ అధ్యక్ష కార్యదర్శులు 18 వ వార్డు ప్రజలు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

సంపుటి : 2 సంచిక: 17 వార్త వేదిక సూర్య
హైదరాబాద్ శనివారం, జూన్ 06, 2026



# ఉచిత కంటి వైద్యం శిబిరం అభినందనీయం

**మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**

దేవరకొండ జూన్ 5 ( వార్త వేదిక సూర్య ):-
గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యం క్యాంపు అభినందనీయం అని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం దేవరకొండ మండలం కొండభీమనపల్లి గ్రామంలో శ్రీ మునుకుంట్ల వెంకట్ రెడ్డి సౌజన్యంతో నిర్వహిస్తున్న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఆయన సందర్శించి కళ్లజోళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. సమాజ సేవా దృక్పథంతో ఈ క్యాంపును ఏర్పాటు చేసిన శ్రీ మునుకుంట్ల వెంకట్ రెడ్డి గారిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల ఆరోగ్యం కోసం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలు సమాజ అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కంటి వ్యాధుల నివారణకు, ముందస్తు గుర్తింపుకు ఇటువంటి శిబిరాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. అనంతరం క్యాంపు నిర్వాహకులు ముఖ్య ఆయన ను శాలువాలతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో మునికుంట్ల వెంకట్ రెడ్డి,స్థానిక ఉప సర్పంచ్ కడారి సైదులు, బొడ్డుపల్లి కృష్ణ, వడత్య బాలు, అప్పనాల తిరుమల, గుండాల వెంకట్,మల్లేష్,పాల్గొన్నారు

# ప్రజాధనం దుర్వినియోగం కావడానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ బాధ్యుడు

**రాజేంద్రనగర్ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ధ్వజం**

**- రెండు దశాబ్దాలు దాటినా పూర్తికాని కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్!**

**- రూ. 30 కోట్లు ఖర్చు చేసినా ప్రజలకు దక్కని ఫలితం.**

**- నర్సబాయికుంట సుందరీకరణ నిధులు పందికొక్కులు మేసేశాయి.**

**- పనుల పేరుతో అనుచరులకు బిల్లులు దోచిపెడుతున్నారంటూ తీవ్ర విమర్శలు.**

గండిపేట్ : ( హైదరాబాద్ మిర్రర్ )
రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల పేరుతో ప్రజాధనం భారీగా దుర్వినియోగం అవు తోందని, దీనికి స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ బాధ్యత వహించాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. నియోజక వర్గంలో పనులు జరగకపోయినా, ఎమ్మెల్యే తన అనుచరులైన కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేయించుకుంటూ లబ్ధి చేకూరుస్తున్నారని ఆరోపించారు. రూ. 30 కోట్లు దాటినా పూర్తికాని స్పోర్ట్స్ కాంప్లెక్స్

రెండు దశాబ్దాల క్రితం (18-03-2007 నాడు) అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి రూ. 5 కోట్ల అంచనా వ్యయంతో కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులకు శ్రీకారం చుట్టారని కార్తీక్ రెడ్డి గుర్తుచేశారు. ఆ నిధులు సరిపోకపోవడంతో మరో ఐదు కోట్లు.. ఇలా నాలుగు సార్లు అంచనాలు పెంచుకుంటూ దాదాపు రూ. 20 నుంచి 30 కోట్ల వరకు ప్రజాధనాన్ని ఖర్చు చేశారన్నారు. అయినా నేటికీ ఈ కాంప్లెక్స్ స్థానిక యువతకు అందుబాటులోకి రాలేదని మండిపడ్డారు. వడ్డించేవాడు మనవాడైతే బంతిలో ఎక్కడ కూర్చున్నా ఒకటే అన్నట్లుగా ఎమ్మెల్యే వ్యవహారం ఉందని, పనులు పూర్తి కాకుండానే కేవలం ఎన్నికల లబ్ధి కోసమే ఆగమేఘాలపై దీనిని ప్రారంభించారని, ఈ మోసాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. పదేళ్ల క్రితం (06-05-2016 నాడు) రూ. 1 కోటి 15 లక్షల 35 వేల అంచనాలతో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ స్వయంగా నర్సబాయికుంట సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారని కార్తీక్ రెడ్డి తెలిపారు. కొన్ని రోజులు జేసీబీతో భూమిని చదును చేసి, నిధులు సరిపోవడం లేదనే నెపంతో మళ్లీ మరో కోటి రూపాయలు మంజూరు

చేయించారన్నారు. తీరా చూస్తే ఒక తూము వద్ద రెండు కాంక్రీట్ దిమ్మెలు కట్టి, చెరువు కట్టకు రాళ్లు పేల్చి చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సబాయికుంట సుందరీకరణ కోసం వచ్చిన సుమారు రెండు కోట్ల రూపాయల ప్రజాధనాన్ని పందికొక్కులు మేసినట్లుగా నాయకులు, కాంట్రాక్టర్లు తిన్నారే తప్ప అక్కడ 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్నట్లుగా ఉందని చుట్టుపక్కల కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. నర్సబాయికుంట సుందరీకరణ మరియు పార్కు ఏర్పాటు కోసం కేటాయించిన నిధులు పక్కదారి పట్టకుండా, పనులు సక్రమంగా జరిగేలా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ దృష్టి పెట్టాలని స్థానిక బస్తీల ప్రజలు కోరుకుంటున్నారు. ఇప్పటికైనా నిధుల దుర్వినియోగాన్ని అరికట్టి, నాణ్యమైన పనులు పూర్తి చేయకపోతే ప్రజల పక్షాన పెద్ద ఎత్తున పోరాడుతామని కార్తీక్ రెడ్డి హెచ్చరించారు.

# కామన్ ప్లాట్‌ఫామ్' ఎన్ జి ఒ అధ్యక్షులు క్రాంతి వర్మ విజ్ఞప్తిపై రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి సానుకూల నిర్ణయం

**ఆసరా పెన్షన్ లబ్ధిదారులకు ఊరట: ఇంటి వద్దకే జీహెచ్ఎంసీ బయోమెట్రిక్ సేవలు**

రాజేంద్రనగర్, జూన్ 05 ( వార్త వేదిక సూర్య ) :
రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని ఆసరా పెన్షన్ లబ్ధిదారులకు రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి పెద్ద ఊరట కల్పించారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు తమ పెన్షన్ అప్‌డేషన్ (నవీకరణ) ప్రక్రియ కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, వారి ఇళ్ల వద్దనే బయోమెట్రిక్ మరియు ఫేస్ స్కానింగ్ సేవలను అందుబాటులోకి తెచ్చారు. 'కామన్ ప్లాట్‌ఫామ్' స్వచ్ఛంద సంస్థ చేసిన విజ్ఞప్తిపై జోనల్ కమిషనర్ మానవతా దృక్పథంతో స్పందించి ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. గతంలో పెన్షన్ల అప్‌డేషన్ కోసం వృద్ధులు, నడవలేని స్థితిలో ఉన్న వికలాంగులు తీవ్రమైన ఎండల్లో గంటల తరబడి లైన్లలో నిలబడి ఇబ్బంది పడేవారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ



'కామన్ ప్లాట్‌ఫామ్' ఎన్ జి ఒ అధ్యక్షులు క్రాంతి వర్మ, ఇటీవల రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ కి ఓ వినతిపత్రం సమర్పించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జి హెచ్ ఎం సి అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందిని (సి ఆర్ పి ) నేరుగా లబ్ధిదారులు నివసిస్తున్న ప్రాంతాలకే పంపుతున్నారు. అక్కడ ఆధార్ కార్డు వెరిఫికేషన్, లైవ్ ఫొటోలు, ఫేస్ స్కానింగ్ ద్వారా వివరాలను ఆన్‌లైన్‌లో విజయవంతంగా అప్‌లోడ్ చేస్తున్నారు. వృద్ధాప్య, వికలాంగ, వితంతువులతో పాటు చేనేత, బీడీ కార్మికులు, ఒంటరి మహిళల పెన్షన్ లబ్ధిదారులందరికీ ఈ సేవలు వర్తిస్తాయి. 80 ఏళ్లు పైబడిన వృద్ధులు పెన్షన్ అప్‌డేషన్ కోసం ఎండలో ఇబ్బంది పడడం చూసి అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మా వినతిని మన్నించి, తక్షణమే స్పందించి ఇంటి వద్దకే సేవలు అందిస్తున్న జోనల్ కమిషనర్ కి, క్షేత్రస్థాయిలో శ్రమిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు. లబ్ధిదారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. నడవలేని స్థితిలో ఉన్నవారు, మంచానికే పరిమితమైన వృద్ధులు, వికలాంగుల కోసం జీహెచ్ఎంసీ ప్రత్యేక నంబర్లను కేటాయించింది. కింది ప్రాంతాల పరిధిలోని లబ్ధిదారులు ఆయా నంబర్లకు ఫోన్ చేస్తే సిబ్బంది నేరుగా ఇంటికే వచ్చి బయోమెట్రిక్ తీసుకుంటారు.

బుద్వేల్ (అపోలో ఫార్మసీ సమీపంలో) 9395510827

రాజేంద్రనగర్ వార్డ్ ఆఫీస్ నెం.8106950749, శివరాంపల్లి నెం. 9618262976, ప్రేమావతీపేట్ 784223386, గగన్‌పహాడ్ నెం.8309490649 సంప్రదించాలని కోరారు. జోనల్ కమిషనర్ కి, క్షేత్రస్థాయిలో శ్రమిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు. లబ్ధిదారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి అని క్రాంతి వర్మ కోరారు.

# ఒక్క మొక్క నాటుదాం... కాలుష్యాన్ని తరిమికొట్టుదాం

**- పచ్చని తెలంగాణ, పచ్చని భారతాన్ని నిర్మిద్దాం : బీజేపీ రాష్ట్ర నాయకుడు సొల్కర్ రెడ్డి**

రాజేంద్రనగర్, జూన్, 05 ( వార్త వేదిక సూర్య ) :
ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు సోల్కర్ రెడ్డి ఇచ్చిన సందేశం ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసేలా ఉంది. నేటి కాలంలో పెరుగుతున్న కాలుష్యం, తగ్గిపోతున్న పచ్చదనం, మారుతున్న వాతావరణ పరిస్థితులు మానవాళికి పెద్ద సవాలుగా మారాయి. ఈ పరిస్థితుల్లో భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం మనందరి బాధ్యత. అమ్మ ప్రేమ ఎలా జీవితాంతం మనకు అండగా ఉంటుందో, చెట్టు కూడా తన నీడతో, ప్రాణవాయువుతో, ఫలాలతో మన జీవితాన్ని సుసంపన్నం చేస్తుంది. అందుకే మా అమ్మ పేరు మీద ఒక చెట్టు అనే కార్యక్రమం కేవలం మొక్కలు నాటే కార్యక్రమం మాత్రమే కాదు, ప్రకృతి పట్ల మన కృతజ్ఞతను చాటే గొప్ప ఉద్యమం.పర్యావరణ పరిరక్షణ అనేది ప్రభుత్వాలకే పరిమితమైన బాధ్యత కాదు. ప్రతి పౌరుడు తన ఇంటి వద్ద, తన గ్రామంలో, తన కాలనీలో కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షిస్తే పచ్చని తెలంగాణ, పచ్చని భారత్ నిర్మించడం సాధ్యమవుతుంది. నేడు మనం నాటే ఒక చిన్న మొక్క రేపటి తరాలకు పెద్ద వరంగా మారుతుంది.ప్రకృతిని కాపాడటం అంటే మన భవిష్యత్తును కాపాడటమే. చెట్లను పెంచడం అంటే జీవాన్ని పెంచడం. పచ్చదనం పెరిగితేనే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుంది. అందుకే



ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో బీజేపీ నాయకులు సదాల రాజశేఖర్ రెడ్డి, సందీప్ ముదిరాజ్, హరికిషన్, విజయ్, బాలకృష్ణలతో పాటు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అందరూ పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.



# రూ.48 లక్షలతో నీటి పైప్‌లైన్ పనులకు ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన

రాజేంద్రనగర్, జూన్ 05 ( వార్త వేదిక సూర్య ) :
కిస్మత్‌పూర్ సెక్షన్ పరిధిలోని శివాలయ టెంపుల్ నుంచి హిమగిరి నగర్ రోడ్ నెం. 07 వరకు త్రాగునీటి సరఫరాను మెరుగుపరిచేందుకు రూ. 48 లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన నీటి పైప్‌లైన్ పనులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ పనుల ద్వారా ప్రాంత ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యం అందుబాటులోకి రానుందని ఎమ్మెల్యే తెలిపారు. ఇకపై ఈ ప్రాంతంలో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు నిరంతరం నాణ్యమైన తాగునీటిని అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూ ఎస్ఎస్‌బీ జీఎం లక్ష్మి, డీజీఎం జవహర్ అలీతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు అధికారులు పాల్గొన్నారు

# మోదీ ప్రభుత్వ 12 సంవత్సరాల విజయోత్సవాల్లో భాగంగా "ఏక్ పెడ్ మా కే నామ్" వృక్షారోపణ

రాజేంద్రనగర్, జూన్ 05 ( వార్త వేదిక సూర్య ) :



మోదీ ప్రభుత్వ 12 సంవత్సరాల విజయోత్సవాల సందర్భంగా, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ ఆధ్వర్యంలో శివరాంపల్లి ప్రజాభవన్ వద్ద "ఏక్ పెడ్ మా కే నామ్" వృక్షారోపణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటారు. పరిశుభ్రమైన, హరిత మయమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే స్వచ్ఛ భారత్ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలని ఈ సందర్భంగా నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ అధ్యక్షుడు పసుపుల సందీప్ ముదిరాజ్, హరికిషన్ జి, సోల్కర్ రెడ్డి, బండారి బాలకృష్ణ, డివిజన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, విజయ్ యాదవ్ పాల్గొన్నారు.

# ఒక్క మొక్క నాటితే ఒక జీవాన్ని కాపాడినట్టే..



**- పచ్చని భూమి కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి: సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ వి.ఎల్. సుభద్రా దేవి**

రాజేంద్రనగర్, జూన్ 05 ( వార్త వేదిక సూర్య ) :
ప్రకృతిని కాపాడితేనే మానవ మనుగడ సురక్షితంగా ఉంటుందని, పచ్చదనం పెంపొందించడమే భావితరాలకు అందించే గొప్ప కానుక అని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ వి.ఎల్. సుభద్రా దేవి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ది సిటిజెన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర కాలనీ నుండి వైఎస్సార్ కాలనీకి వెళ్లే 60 ఫీట్ రోడ్డులో నిర్వహించిన మొక్కల నాటే కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడం అత్యంత అవసరమని అన్నారు. ప్రతి కాలనీలోని ఖాళీ స్థలాలు, పార్కులు మరియు ప్రజా ప్రదేశాల్లో విస్తృతంగా మొక్కలు నాటి వాటిని అభివృద్ధి చేయడానికి చర్యలు చేపడతామని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. మొక్కలు మనకు స్వచ్ఛమైన గాలిని, ఆహారాన్ని, నీటి సంరక్షణను అందిస్తాయి. మొక్కలను నాటడం ఎంత ముఖ్యమో, వాటిని సంరక్షించడం కూడా అంతే ముఖ్యమైనది. నేడు మనం నాటే ప్రతి మొక్క రేపటి తరాలకు జీవనాధారంగా నిలుస్తుంది అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ది సిటిజెన్ కౌన్సిల్ వ్యవస్థాపకులు ధూళిపాళ సీతారాం, అధ్యక్షుడు బొమ్ము ఉపేంద్ర నాథ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణరావు, జనరల్ సెక్రటరీ షేక్ ఆరిఫ్, ఈసీ సభ్యులు, కాలనీ ప్రతినిధులు, యువత మరియు స్థానికులు పాల్గొన్నారు.

# ప్రకృతిని దైవంగా పూజించే సంస్కృతి మనది: బొక్క బాల్ రెడ్డి

రాజేంద్రనగర్, జూన్ 05 ( వార్త వేదిక సూర్య ) :
ప్రకృతిని కేవలం వనరుగా కాకుండా దైవస్వరూపంగా, జగన్మాతగా ఆరాధించే గొప్ప సంస్కృతి భారత దేశానిదని బీజేపీ సీనియర్ నాయకులు బొక్క బాల్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉప్పర్పల్లిలోని బీజేపీ కార్యాలయ ఆవరణలో ఆయన పార్టీ నాయకులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, హిందూ సనాతన ధర్మంలో చెట్లు, నదులు, పర్వతాలు వంటి ప్రకృతి సంపదలకు దైవత్వాన్ని ఆపాదించి సంరక్షించే సంప్రదాయం ఉందన్నారు. "వృక్షో రక్షతి రక్షితః" అనే వేద వాక్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుని చెట్ల సంరక్షణకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు గతంలో ఉప్పర్పల్లి బీజేపీ కార్యాలయంలో నాటిన మొక్కలు నేడు మహా వృక్షాలుగా మారి పర్యావరణానికి మేలు చేస్తున్నాయని గుర్తు చేశారు.

ఆ చెట్లు పండ్లు, పూలు అందించడమే కాకుండా స్వచ్ఛమైన గాలిని అందిస్తూ పరిసరాలను పచ్చగా మార్చాయని తెలిపారు .కేవలం ప్రచారం కోసం మొక్కలు నాటడం కాకుండా, వాటిని వృక్షాలుగా ఎదిగే వరకు సంరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని చెప్పారు. పర్యావరణ పరిరక్షణే నిజమైన దేశభక్తి, భవిష్యత్ తరాలకు అందించే గొప్ప సంపద అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు విట్టల్, శ్రీకాంత్ రెడ్డి, పవన్ కుమార్, ప్రవీణ్, భోపాల్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ వాడకంపై అవగాహన

**ప్లాస్టిక్‌కు గుడ్‌బై చెప్పండి -- వ్యాపారస్తులకు ఉషారాణి పిలుపు**

రాజేంద్రనగర్, జూన్ 05 ( వార్త వేదిక సూర్య ) :
ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక మార్కెట్‌లో వ్యాపారస్తులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్లను ఉపయోగించవద్దని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల భూమి, నీరు, జీవావరణ వ్యవస్థలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని, ప్లాస్టిక్ నియంత్రణ ప్రతి పౌరుడి బాధ్యత అని మాజీ కౌన్సిలర్ ఉషారాణి పేర్కొన్నారు. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా గుడ్డ సంచులు, జ్యూట్ బ్యాగులు, కాగితపు సంచులను వినియోగించాలని వ్యాపారస్తులకు సూచిం చారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యాపారస్తులు, ప్రజలు పాల్గొన్నారు.

సంపుటి : 2 సంచిక: 17 వార్త వేదిక సూర్య
హైదరాబాద్
శనివారం, జూన్ 06, 2026



# ప్రకృతిని రక్షిస్తే ప్రకృతి మనల్ని రక్షిస్తుంది: తోకల శ్రీనివాస్ రెడ్డి

### ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములు కావాలి

రాజేంద్రనగర్, జూన్ 05 ( వార్త వేదిక సూర్య ) :
కాటేదాన్ డివిజన్ బృందావన్ కాలనీలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మోదీ ప్రభుత్వ 12 సంవత్సరాల విజయోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన “ఏక్ పెడ్ మా కే నామ్” ఉద్యమం తల్లిని గౌరవించే భావనతో పాటు ప్రకృతి పరిరక్షణకు ప్రేరణనిస్తోందన్నారు. ప్రకృతిని కూడా తల్లిలాగే ప్రేమతో, శ్రద్ధతో కాపాడాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కనీసం ఒక మొక్కనైనా నాటి సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమం బీజేపీ కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు గోద పాండు యాదవ్ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రావుల భాస్కర్, సంతు గౌడ్, బొమ్మరాజు నరసింహ, శ్రీకాంత్ రెడ్డి, రమణ, రమేష్ రెడ్డి, శేఖర్, మజార్, కిరణ్ రాజ్, స్వామి, రామారావు, శంకర్ రెడ్డి, సానిటేషన్ సూపర్వైజర్, సిబ్బంది మరియు స్థానికులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా జర్నలిస్టుల పిల్లలకు 50% ఫీజు రాయితీ

### డీఈఓ ఉత్తర్వులు జారీ

రాజేంద్రనగర్, జూన్ 05 ( వార్త వేదిక సూర్య ) :



రంగారెడ్డి జిల్లాలోని జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ జిల్లా విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు శుక్రవారం ఆదేశాలు విడుదల చేశారు. జిల్లాలోని ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా జర్నలిస్టుల పిల్లలకు విద్యాభారం తగ్గించేలా పూర్తి ఫీజు రాయితీ కల్పించాలని టీయూ డబ్ల్యూజే-ఐజేయూ జిల్లా యూనిట్ జిల్లా కలెక్టర్, డీఈఓలను కోరింది. జిల్లా అధ్యక్షులు ఎండి సలీమ్ పాషా నేతృత్వంలోని ప్రతినిధి బృందం గురువారం అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించింది. వినతిపై సానుకూలంగా స్పందించిన జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం ఉత్తర్వుల ప్రతులను జిల్లా అధ్యక్షులు ఎండి సలీమ్ పాషాకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డీఈఓ వెంకటేశ్వర్లుకు జిల్లా అధ్యక్షులు సలీమ్ పాషా కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆదేశాలు జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, సంబంధిత ఉత్తర్వులను అన్ని మండల విద్యాధికారులకు పంపించి అమలుపై పర్యవేక్షణ చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మారాటి రవి, జర్నలిస్టు నేతలు కరుణాకర్, భాస్కర్, భార్గవ్, శ్రీనివాస్, శివ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తా

### స్థానిక సమస్యలపై పాదయాత్ర నిర్వహించిన మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్

కుత్బుల్లాపూర్, జూన్ 05 (వార్త వేదిక సూర్య) :



ప్రజా సమస్యల కోసం తాను నిరంతరం కృషి చేస్తానని జగద్గిరిగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలో జగద్గిరి నగర్ లో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలు తెలుసుకోవడానికి బస్తీ ప్రజలతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం జగన్ మాట్లాడుతూ తాను అధికారంలో ఉన్న లేకున్నా నిరంతరం డివిజన్ ప్రజలతో కలిసి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. తాను కార్పొరేటర్ గా పదవి బాధ్యతలు చేపట్టిన నాటినుండి డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాలను కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు. జగద్గిరి నగర్ (యూజీడీ, సీసీ రోడ్లు) తదితర మౌలిక వసతుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశానని అన్నారు. జగద్గిరి నగర్ లో చేపట్టవలసిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ డివిజన్ అధ్యక్షులు బొగ్గుల సురేష్, గణేష్, యాదగిరి, నరసింహారెడ్డి, సతీష్, ప్రభాకర్, పద్మనాభం, బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని పరిరక్షించుకుంటేనే మానవాళికి మనుగడ ఉంటుంది



### బిజెపి నాయకులు కుమార్ యాదవ్

కూకట్ పల్లి, జూన్ 05 (వార్త వేదిక సూర్య) :
ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆల్విన్ కాలనీ డివిజన్ జలకన్య పార్క్ దగ్గర బిజెపి యువ నాయకులు శైలేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో బిజెపి నాయకులు కుమార్ యాదవ్ స్థానిక నాయకులతో కలిసి మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, బట్ట సంచులను ఉపయోగించడం, వీలైనన్ని ఎక్కువ మొక్కలు నాటడం, నీటిని, విద్యుత్తును ఆదా చేయడం వంటి వాటిపైన ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణ ఎవరిదో బాధ్యత అనే భ్రమలో జీవిస్తూ పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాం అన్నారు. దీనివలన ఉష్ణోగ్రతలలో మార్పులు సంభవిస్తూ అకాల వర్షాలు, తీవ్రతరమైన ఎండలు, కలుషితం అవుతున్న నేల, నీరు గాలి వల్ల మానవాళి మనుగడకు తీవ్ర ముప్పు ఏర్పడుతుంది అన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల చుట్టూ చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడుకుందాం అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్ రావు, రాష్ట్ర నాయకులు నరేందర్ రెడ్డి, కేశవరావు, దుర్గ ప్రసాద్, మని భూషణ్, కమలాకర్ రెడ్డి, కుమార్ చారి, రఘు, రమేష్, సంతోష్, నరసింహ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# పార్ది వాడ బస్తీలో అభివృద్ధికి కొత్త రూపం..



### రూ.45 లక్షలతో ఆధునిక కమ్యూనిటీ హాల్ నిర్మాణం

### యువత కోసం ఆధునిక జిమ్ -- పేద ప్రజల శుభకార్యాలకు కమ్యూనిటీ హాల్ అందుబాటులోకి

### మొదటి అంతస్తు పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

బాలానగర్, జూన్ 05 (వార్త వేదిక సూర్య) :
కూకట్ పల్లి నియోజకవర్గం, ఫతే నగర్ డివిజన్ పరిధిలోని పార్దివాడ (పిట్టల బస్తీ) అభివృద్ధిలో మరో కీలక అడుగు పడుతోంది. స్థానిక ప్రజల దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో రూ.45 లక్షల నిధులతో నిర్మిస్తున్న కమ్మ కమ్యూనిటీ హాల్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు పనులను మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి సంబంధిత వారికి పలు సూచనలు చేశారు. భవనం నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా, ప్రజలకు ఉపయోగపడే విధంగా అన్ని సౌకర్యాలతో నిర్మించాలని ఆదేశించారు. మాజీ కార్పొరేటర్ సతీష్ గౌడ్ మాట్లాడుతూ పార్దివాడ (పిట్టల బస్తీ) యువత ఎంతో కాలంగా జిమ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారని, వారి అభ్యర్థన మేరకు కమ్యూనిటీ హాల్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆధునిక పరికరాలతో కూడిన జిమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. యువత ఆరోగ్యంగా ఉండేందుకు, క్రీడా స్ఫూర్తి పెంపొందించేందుకు ఈ జిమ్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. త్వరలోనే ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేతుల మీదుగా జిమ్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తును స్థానిక ప్రజలు తమ వివాహాలు, శుభకార్యాలు, కుటుంబ వేడుకలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అనువుగా నిర్మిస్తున్నామని చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు తక్కువ ఖర్చుతో సౌకర్యవంతమైన వేదిక అందుబాటులోకి రావడం వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమం ద్వారా పిట్టల బస్తీ ప్రజలకు ఒకే భవనంలో సామాజిక అవసరాలు, యువత కోసం ఆరోగ్య సదుపాయాలు అందుబాటులోకి రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. బస్తీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జయమ్మ, బస్వరాజ్ పాల్గొన్నారు.

# టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు




కూకట్ పల్లి, జూన్ 05 (వార్త వేదిక సూర్య) :
కూకట్ పల్లి నియోజకవర్గం, శ్రీరంగం ఫౌండేషన్ చైర్మన్, పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం జన్మదిన వేడుకలను నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. సత్యం శ్రీరంగం పుట్టిన రోజును పురస్కరించుకొని కేపిహెచ్బి టెంపుల్ బస్ స్టాప్ లో కేపిహెచ్బి కల్చరల్, వెల్ఫేర్ & స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజేష్ శంకర్ గౌడ్, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్ష్యులు కృష్ణ రాజ్ పుత్ ఆధ్వర్యంలో శ్రావణి హాస్పిటల్స్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం, పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్పర్సన్ కల్వ సుజాత గుప్త, శ్రీరంగం ఫౌండేషన్ కో చైర్పర్సన్ శ్రీరంగం ఇందుమతి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు గంగుల అంజలి యాదవ్ ముఖ్య అతిథిలుగా హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి, కేకే కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కల్వ సుజాత గుప్త మాట్లాడుతూ ప్రజాసేవలో సత్యం శ్రీరంగం మరిన్ని విజయాలు సాధించాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. బాలానగర్ డివిజన్ డివిజన్ అధ్యక్షులు మధు గౌడ్, బోయిన్ పల్లి డివిజన్ అధ్యక్షులు మల్లికార్జున్ యాదవ్, అల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు మొయినుద్దీన్, ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ శేఖర్ గజానంద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాజుల మహేష్ గౌడ్, సుంకన్న, ఇమ్ము, నరేష్ ఆధ్వర్యంలలో కేక్ లు కట్ చేసి, పండ్లు పంపిణి చేసి, స్వీట్లు పంచి, అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కృష్ణ రాజ్ పుత్ ఆధ్వర్యంలో విజయ దుర్గ సెంటర్ లో పారిశుద్ధ కార్మికులకు చీరల పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, సీనియర్ మహిళా నాయకురాలు స్వరూప గౌడ్, ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, డివిజన్ ల మహిళా అధ్యక్షురాళ్లు గుండ జ్యోతి, విజయ లక్ష్మి, మారుతీ, పొన్నం రజిత, జోజమ్మ, భారతమ్మ, ఏ ఎం సి డైరెక్టర్ ఫణి కుమార్, అరుణ్ గౌడ్, స్పృంజిత్ గౌడ్, కనకయ్య ముదిరాజ్, పవన్ గాండ్ల, ఆదిత్య, సంధ్య, ప్రణతి, అరవింద, నరేష్, వెంకటేష్, యుగేందర్, సాగర్, శ్రీశైలం, శంకర్, ఖలీమ్, విశాల్, నవీన్, ప్రశాంత్, లడ్డు, సాయి, పద్మ, శ్వేతా, జల్ల శివ, ప్రభాకర్, మల్లేష్, అమీర్, పాల్, రమేష్ గుప్త, శ్రీకాంత్, కనకరాజు యాదవ్, అరవింద్ గౌడ్, వెంకీ, శ్రీనివాస్, ఖేరా సింగ్, జ్యోతి, శ్రీను, కలికోట మహేష్, గోవింద్, పవన్, పారిశుద్ధ కార్మికులు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ సోదరులు, తదిరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# ఘనంగా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య జన్మదిన వేడుకలు

### శుభాకాంక్షలు తెలిపిన టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్

కూకట్ పల్లి, జూన్ 05 (వార్త వేదిక సూర్య) :
సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య జన్మదిన కార్యక్రమాలు కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ శ్రీ హేమ దుర్గాభవన్ లో శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని లక్ష్మయ్య చేత కేక్ కటింగ్ చేయించి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులకు సముచిత గౌరవం ఉంటుందని, వారికి మంచి పదవుల లభించే లాగా తన వంతు కృషి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు నాయకులకు మంచి పదవులు లభిస్తాయి అని పార్టీ కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గాలి బాలాజీ, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సాయిబాబా చౌదరి, ధర్మ రావు, మస్తాన్ రెడ్డి, కనకయ్య, పిడికిటి గోపాల్ చౌదరి, మేకల మహేష్, నసీర్, మోహన్ నాయక్, బండి సుధా, సంధ్య, కల్పన, అపర్ణ , జయలక్ష్మి, రాజేశ్వరి, ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, దానలక్ష్మి,రజని, నాగమణి, తదితరులు నాయకులు పాల్గొన్నారు.

# వరద నీటిని డ్రైనేజీ పైప్‌లైన్లలో కలపొద్దు

### మున్సిపల్ అధికారులకు కాలనీవాసుల వినతి

### సాయికృష్ణ, చందు లేఔట్, ఎన్ఆర్ఐ కాలనీలతో పాటు ఇతర ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం!

### ప్రగతి నగర్ కమాన్ వద్ద క్షేత్రస్థాయిలో పర్యటించిన జోనల్ కమిషనర్ పింకేష్‌కుమార్

కుత్బుల్లాపూర్, జూన్ 05 (వార్త వేదిక సూర్య):
సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ సర్కిల్ ప్రగతి నగర్ కమాన్ వద్ద చేపడుతున్న వరద నీటి పైప్‌లైన్ పనులను కుత్బుల్లాపూర్ జోన్ మున్సిపల్ కమిషనర్ పర్మార్ పింకేష్‌కుమార్ లలిత్‌కుమార్ గురువారం ఉదయం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని స్థానిక సమస్యలపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. సాధారణ డ్రైనేజీ పైప్‌లైన్లలోకి వరద నీటిని కలపకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా స్థానిక కాలనీవాసులు అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఒకవేళ వరద నీటిని డ్రైనేజీ పైప్‌లైన్లలో కలిపితే వర్షాలు పడినప్పుడు ఒత్తిడి తట్టుకోలేక డ్రైనేజీలు పొంగిపొర్లుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల సాయికృష్ణ కాలనీ, చందు లేఔట్, ఎన్ఆర్ఐ కాలనీలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు తీవ్రంగా ముంపునకు గురవుతాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గతంలో వచ్చిన వరద ముంపు వల్ల అపార్ట్‌మెంట్‌లలోకి నీరు చేరి అనేక కష్టాలు పడ్డామని స్థానికులు గుర్తు చేశారు. తాగునీరు కలుషితమవ్వడం, సెల్లార్లలో నిలిచిన నీటి కారణంగా కార్లు, వాహనాలు పూర్తిగా దెబ్బతినడంతో అటు ఆరోగ్యపరంగా, ఇటు ఆర్థికంగా తాము తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, వరద నీటి మళ్లింపునకు డ్రైనేజీతో సంబంధం లేకుండా శాశ్వత ప్రాతిపదికన ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని కోరారు.

ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో జోనల్ కమిషనర్‌తో పాటు నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సాబీర్ అలీ, ఏఈ ప్రవీణ్ కుమార్, ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే స్థానిక కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు బొట్ల తిరుపతి, శరత్ రెడ్డి, దారుకోల్ శ్రీనివాస్, సురేష్, తిరుపతి రెడ్డి, హరీష్, సాయి, రమేష్, విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొని అధికారులకు క్షేత్రస్థాయిలో ఉన్న లోపాలను వివరించారు.

# -ప్రైమరీ స్కూల్‌లలో ఉద్యోగాలు.. అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

### - రాజేంద్రనగర్‌లో ప్రీ-ప్రైమరీ స్కూల్‌లకు ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల నియామకాలు

### - ఇంటర్ పాస్ అభ్యర్థులకు ఇన్‌స్ట్రక్టర్ అవకాశం --

### 7వ తరగతి అర్హతతో ఆయా పోస్టులు

రాజేంద్రనగర్, జూన్ 05 ( వార్త వేదిక సూర్య ) :
రాజేంద్రనగర్ మండల పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ప్రీ-ప్రైమరీ స్కూల్‌లలో ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యా అధికారి శంకర్ రాథోడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత అర్హతగా నిర్ణయించగా, ప్రాథమిక ఉపాధ్యాయ శిక్షణ (ప్రైమరీ ట్రైనడ్ టీచర్స్ ) పొందిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆయా పోస్టులకు 7వ తరగతి ఉత్తీర్ణత అర్హతగా నిర్ణయించారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, మాజీ సైనికులకు 3 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాల వయో సడలింపు వర్తిస్తుందని వివరించారు. అర్హత కలిగిన అభ్యర్థులు సంబంధిత పాఠశాలలు లేదా మండల విద్యా కార్యాలయంలో పూర్తి వివరాలు తెలుసుకుని నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యా అధికారి శంకర్ రాథోడ్ సూచించారు.

# మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుదాం

### మాజీ కార్పొరేటర్ - కొంతం దీపిక నరేష్

సికింద్రాబాద్, జూన్ 05(వార్త వేదిక సూర్య)
మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుదామని మోండా మార్కెట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు మాకే నా ఏక్ పెడ్ కార్యక్రమంలో భాగంగా రెజిమెంటల్ బజార్, పలు ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు జితూగుప్తా, ప్రశాంత్ జైన్, గోవర్ధన్, సాయి, రఘు, రాహుల్, నరేందర్, లడ్డు, నర్సింగ్, భాగ్య, సంగీత తదితరులు పాల్గొన్నారు.

# నిందితులకు 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష

**వలిగొండ: జూన్ 5 (వార్త వేదిక సూర్య):** వలిగొండ పోలీస్ స్టేషన్, క్రైం నెం.55/2023, యు/ఎస్ 307, 353, 506 ఆర్/ డబ్ల్యు 34 ఐపిసి మరియు సెక్షన్ 3 పిడిపిపి చట్టం కింద నమోదై, ఎస్ సి. నెంబర్.91/2023 గా రామన్నపేట సహాయ సెషన్స్ న్యాయస్థానంలో విచారణలో ఉన్న కేసులో న్యాయమూర్తి జి. సభిత తీర్పు వెలువరించారు. ఈ కేసులో నిందితులైన ఎ1: కళ్ళెం నరేష్, తండ్రి ధవాఖానా, వలిగొండ గ్రామం, ఎ2: వేముల నర్సింగ్ రావు మరయ్య, పులిగిల్ల గ్రామం, ఎ3: బల్లెపు కృష్ణస్వామి, తండ్రి సాయిలు,వలిగొండ టౌన్ ,(ఎ-3)లను నేరం రుజువైనందున దోషులుగా నిర్ధారించి, ప్రతి నిందితునికి 05 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష తో పాటు రూ.11,000/- చొప్పున జరిమానా విధించారు. ఈ విధంగా ముగ్గురు నిందితులకు కలిపి రూ.33,000/- జరిమానా విధించబడింది. ఈ కేసులో ప్రభుత్వ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు బి. వరలక్ష్మి మరియు ఎస్. కృష్ణవేణి సమర్థవంతంగా వాదనలు వినిపించగా, కేసు దర్యాప్తు అధికారిగా వ్యవహరించిన పి. ప్రభాకర్ ప్రస్తుతం సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, సీసీఎస్ మల్కాజిగిరి పోలీస్ స్టేషన్, ప్రస్తుత వలిగొండ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ వి. యుగేందర్, లైజన్ ఆఫీసర్ డబ్ల్యూపిసి-4579 పి. అశ్విని మరియు సిడిఓ ఏ. రామాచారి, పీసీ-3060ల సమన్వయంతో కేసు విజయవంతంగా రుజువై నిందితులకు శిక్ష పడినది. ఈ కార్యక్రమంలో వలిగొండ ఎస్సై యుగేందర్ గౌడ్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుపై ఎమ్మెల్యే ప్రకటన ఏమైంది..?



**మోత్కూరు, జూన్ 05 ( వార్త వేదిక సూర్య ):** మోత్కూరు నుండి రాజన్నగూడెం (2 కి.మీ వరకు) అస్తవ్యస్తంగా ఉన్న ఈ రోడ్డు పనులు జూన్ 4 వరకు ప్రారంభించకపోతే 5వ తేదీన తానే స్వయంగా దీక్ష చేస్తానని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఇటీవల ప్రకటన జారీ చేశారని, 5వ తేదీ వచ్చిన దీక్ష ఏమైందని మార్కెట్ కమిటీ చైర్మన్ కొణతం యాకుబ్ రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ రోడ్డు మరమ్మతులకై గత బారాస ప్రభుత్వ హయంలో అప్పటి ఎమ్మెల్యే గాదారి కిషోర్ కుమార్ 5.80 కోట్లు మంజూరు చేశారని, కిషోర్ వేసిన రోడ్డు శిలాఫలకంతో కొత్త శిలఫలకాన్ని వేసి రెండున్నర సంవత్సరాలు దాటిన రోడ్డు పనులు ఎందుకు పూర్తి కాలేదో సమాధానం చెప్పాలని చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఈ రోడ్డు విషయంలో ముగ్గురు,నలుగురు కాంట్రాక్టర్లు మారారని, దీని వెనక మర్మమేమిటో ప్రజలు అన్ని గమనిస్తున్నారని అన్నారు. ఆర్. అండ్. బి అధికారులను ఎమ్మెల్యే హెచ్చరించిన పనులు ప్రారంభం కాలేదంటే అధికారులపై ఎమ్మెల్యేకు పట్టులేనట్టేనని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు ఈ రోడ్డును ప్రారంభించాలని లేనియెడల బారాస ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

# పర్యావరణాన్ని రక్షింటం మనందరి బాధ్యత




**రామన్నపేట ( వార్త వేదిక సూర్య ):** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం రోజున మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, రామన్నపేట ఆధ్వర్యంలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటడం జరిగింది.ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి -- కమ్ -- ఛైర్మన్, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ జి. సబితా రామన్నపేట మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుని బాధ్యత అని పేర్కొన్నారు. ప్రకృతి సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని అందించేందుకు పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్. శిరీష ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, వి. రత్నకుమారి అదనపు జూనియర్ సివిల్ జడ్జి, డి. సత్తయ్య సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ సుక్క శ్రవణ్ కుమార్ , ప్యానెల్ అడ్వకేట్లు కూనూరు శ్రీనివాస్ , సోమ సతీష్ రెడ్డి , శ్రీ బర్ల డేవిడ్ , లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ నోముల స్వామి , ఎన్. వెంకటేశ్వర్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామన్నపేట, కోర్టు కానిస్టేబుళ్లు మరియు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని అందరికీ అవగాహన కల్పించారు.

# వాట్సాప్ విప్లవం: కోచింగ్ సెంటర్ లేదు

**- జీరో ఫీజుతో 55 మంది పల్లె బిడ్డలు ఆర్మీకి సెలెక్ట్!**

**- ప్రైవేట్ అకాడమీల సామ్రాజ్యాన్ని కదిలించిన ఎస్ వై ఏం ఎస్ సంచలన చరిత్ర!**



**యాధాద్రి భువనగిరి, జూన్ 05 (వార్త వేధిక సూర్య):-**"విద్య అంటే వ్యాపారం కాదు.. పేదవాడికి అందించే పవిత్రమైన సేవ" అని నిరూపిస్తూ సైనిక యూత్ మోటివేషనల్ సొసైటీ దేశ చరిత్రలోనే సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. లక్షల రూపాయల ఫీజులు, కోట్ల రూపాయల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ముసుగులో సాగుతున్న ప్రైవేట్ డిఫెన్స్ అకాడమీల దోపిడీకి గట్టి చెక్ పెడుతూ, కేవలం ఒక వాట్సాప్ గ్రూప్ ద్వారా 2026 ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌లో ఏకంగా 55 మంది యువకులకు ఉద్యోగాలు వచ్చేలా చేసి ఎస్వైఎంఎస్ సంచలనం సృష్టించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఈ 55 మంది పల్లె బిడ్డలు ఇప్పుడు దేశ సరిహద్దులను కాపాడే సైనికులుగా మారారు.

**ఫీజు సున్నా.. కసి వంద శాతం:** గత దశాబ్ద కాలంగా డిఫెన్స్ కోచింగ్ అంటే ఏడాదికి ₹1.5 లక్షల నుండి ₹4 లక్షల వరకు వసూలు చేస్తున్న అకాడమీల మధ్య.. ఎలాంటి బిల్డింగ్, మౌలిక వసతులు లేకుండా కేవలం ఒక వాట్సాప్ గ్రూప్, దేశభక్తి అనే బలమైన ఆశయంతో ఈ విజయం సాధ్యమైంది. ఎంపికైన 55 మందిలో 50 మంది నిరుపేద రైతులు, వ్యవసాయ కూలీలు, ఆటో డ్రైవర్లు, చిన్న దుకాణాలు నడిపే సామాన్య కుటుంబాల వారే కావడం విశేషం.

విజయ తీరాలకు చేర్చిన 3 సూత్రాలు ఎస్ వై ఏం ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారి ప్రసాద్ ముదిరాజ్ సారథ్యంలో మూడు ప్రత్యేక సూత్రాలతో ఈ విజయాన్ని సాధించారు.

**1. జీరో ఫీజు - మాక్స్ కమిట్మెంట్ :**రూపాయి ఫీజు లేకుండా స్టడీ మెటీరియల్స్, పీడీఎఫ్ నోట్స్, డైలీ 100 మార్కుల మాక్ టెస్టులు, ఫిజికల్ ఫిట్‌నెస్ వీడియోలను ఉచితంగా అందించారు. **2. 24ఇ7 వ్యక్తిగత మెంటార్‌షిప్:** బండారి ప్రసాద్ ముదిరాజ్ స్వయంగా ప్రతి విద్యార్థికి పర్సనల్ మెంటార్‌గా ఉంటూ అర్ధరాత్రి 2 గంటలకు వచ్చే డౌట్లను కూడా వాట్సాప్ ద్వారా నివృత్తి చేశారు. **3. భరోసా :** తెలంగాణలోని ఆదిలాబాద్ నుండి ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం వరకు ప్రతి మండలం నుండి అభ్యర్థులను ఒకే వేదికపైకి తెచ్చి "నీ వెనుక 1000 మంది సైనికులు ఉన్నారు" అనే భరోసా కల్పించారు."కోచింగ్ సెంటర్ అనేది కేవలం ఒక బిల్డింగ్ కాదు.. అది ఒక ఆలోచన. కసి, క్రమశిక్షణ, దేశభక్తి ఉంటే వాట్సాప్ గ్రూప్ కూడా నేషనల్ డిఫెన్స్ అకాడమీ అవుతుందని మా పిల్లలు నిరూపించారు" అని బండారి ప్రసాద్ ముదిరాజ్ గర్వంగా ప్రకటించారు.

# పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**- ఫోక్ యాక్టర్ నజీమ్**

**సిద్దిపేట, జూన్ 5(వార్త వేధిక సూర్య ):-** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విశ్వంభర ఫౌండేషన్, నేచర్ గ్రీన్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో, కళాశాల యాజమాన్యం మద్దతుతో మొక్కల నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఫోక్ యాక్టర్ నజీమ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే విస్తృతంగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ప్రకృతి పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, పర్యావ రణ సమతుల్యత కోసం మొక్కల పెంపకం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అయోధ్య రెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా గ్లోబల్ వార్మింగ్ ప్రభావం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో భూభాగంలో అటవీ విస్తీర్ణం 33 శాతానికి తగ్గకుండా ఉండేలా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కల నాటడాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించి వాటి సంరక్షణకు కూడా కట్టుబడి ఉండాలని సూచించారు.కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రాంగణంలో పలు రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా "ఒక వ్యక్తి -- ఒక చెట్టు -- ఒక తరం" అనే నినాదాన్ని సంస్థ ప్రతినిధులు ప్రకటిస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్,మ్యాథమాటిక్స్ విభాగాల హెచ్‌వోడి లు గోపాల. సుదర్శన్, మధుసూదన్, ఇన్‌స్టా ఇన్‌ఫ్లూయెన్సర్ పవన్, విశ్వంభర ఫౌండేషన్ మరియు నేచర్ గ్రీన్ సంస్థల ప్రతినిధులు వంగల సంతోష్, పోచం పల్లి. రాజేష్, రామ్ చందర్ రెడ్డి, నాగ చందర్ రెడ్డి, రాజశేఖర్, అమర్ నాథ్. లింగంపల్లి, శ్రీ వర్ధన్, కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.




# సబ్‌స్టేషన్‌లో నూతన విద్యుత్ బ్రేకర్లు ప్రారంభం

**- లో-వోల్టేజ్ సమస్యలకు చెక్!**

**- నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం**

**- డీఈఈ వెంకటేశ్వర్లు, ఏడీఈ పీరియా నాయక్!**



**మోటకొండూరు, జూన్ 05 (వార్త వేధిక సూర్య):-** మోటకొండూరు మండల పరిధిలోని చాడ గ్రామ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వినియోగదారులకు మరింత నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరాను అందించేందుకు అధికారులు సరికొత్త సాంకేతికతను అందుబాటులోకి తెచ్చారు. శుక్రవారం విద్యుత్ శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు మరియు ఏడీఈ పీరియా నాయక్ ఆధ్వర్యంలో ముత్తి రెడ్డి గూడెం సబ్‌స్టేషన్‌లో చాడ మరియు పరిసర ప్రాంత గ్రామాలకు విద్యుత్ సౌకర్యం లో అంతరాయం కలగకుండా నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ బ్రేకర్లను స్విచ్ ఆన్ చేసి అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా అధికారులు మరియు చాడ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ నూతన బ్రేకర్ల ఏర్పాటు ద్వారా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు లో-వోల్టేజ్ సమస్యలు తలెత్తకుండా, ఓవర్‌లోడ్ కాకుండా అరికట్టవచ్చున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో ఎక్కడైనా లైన్లలో సాంకేతిక లోపాలు లేదా బ్రేక్‌డౌన్ జరిగితే, ఈ బ్రేకర్లు తక్షణమే స్పందించి సబ్‌స్టేషన్‌లోని ఇతర పవర్ ట్రాన్స్‌ఫార్మర్లకు నష్టం జరగకుండా కాపాడుతాయని, దీనివల్ల త్వరగా సమస్యను గుర్తించి విద్యుత్ పునరుద్ధరణ చేయవచ్చని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరంతర విద్యుత్ సరఫరాకు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మోటకొండూరు సెక్షన్ విద్యుత్ శాఖ ఏఈ సృజన్ కుమార్,వార్డు సభ్యులు ఈర్ల మైసయ్య, బొడ్డుపల్లి వెంకన్న, సొప్పరి ఎల్లేందర్, పబ్బతి జయంత్ రెడ్డి, కాంట్రాక్టర్ నవీన్ కుమార్ రెడ్డి మరియు మోటకొండూరు సెక్షన్ విద్యుత్ సిబ్బంది బొట్ల నరేష్, ఆదేపు శ్రీకాంత్ మహేశ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# వడ్ల కొనుగోలు సెంటర్లలో అక్రమాలను అరికట్టాలి

**- తెలంగాణ ప్రజా ఫ్రంట్**




**యాదాద్రి భువనగిరి/వార్త వేదిక సూర్య :-** తెలంగాణ ప్రజా ఫ్రంట్ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ పక్షాన జిల్లా వ్యాప్తంగా వడ్ల కొనుగోలు ఐకెపి సెంటర్లలో పిఎసిఎస్ సెంటర్లలో జరుగుతున్న దోపిడి అక్రమాలను అరికట్టాలని ఆర్డీవోకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కాశపాక మహేష్, కార్యదర్శి రాసార నర్సింహ, మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ఫ్రంట్ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ గత మూడు రోజులుగా జిల్లాలోని మండలంలోని బస్వాపూర్, హుస్నాబాద్, బాలంపల్లి, రామచంద్రపురం, బొల్లెపల్లి, మరియు పలు గ్రామాల ఐకెపి సెంటర్లను సందర్శించడం జరిగిందని వర్షాకాలం ప్రారంభమై రెండు వారాలు గడుస్తున్న జిల్లా వ్యాప్తంగా వడ్ల కొనుగోలు సెంటర్ల కల్లాలలో కుప్పలుగా వడ్లు పేరుకుపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని ఐకెపి పిఎసిఎస్ సెంటర్లలో అక్రమాలు జరుగుతున్న ప్రభుత్వ అధికారులు నిమ్మకు నీరెత్తకుండా ఉన్నారని కొనుగోలు సెంటర్లో ప్రభుత్వం నిర్దేశించిన 41 కిలోను మించి 42.200 గ్రాములు 42.300 గ్రాములు కాంటా పెడుతున్నారని తిరిగి మల్ల మిల్లర్లు 15 బస్తాలు కటింగ్ చేయడం జరుగుతుందని ఇట్టి విషయమై ఐకెపి సెంటర్ నిర్వాహకులను అడిగితే వారు మిల్లర్ల పేరు చెబుతున్నారని మిల్లర్లను అడిగితే మాకేమి సంబంధం లేదని అంటున్నారు మరి ఐకెపి సెంటర్లను కొనుగోలు కేంద్రాలను మిల్లర్లు నడుపుతున్నారా లేదా దళారు నడుపుతున్నారా తెలియడం లేదని ఇలా కటింగ్ పేరు మీద తూకం పేరు మీద రైతులు తీవ్రమైన దోపిడీకి గురవుతున్న ప్రభుత్వం ఇక్కడ ఉన్న స్థానిక ఎమ్మెల్యే మంత్రి కనీసం స్పందించకపోవడం సిగ్గుచేటని జిల్లా వ్యాప్తంగా మరియు రాష్ట్రవ్యాప్తంగా ఇదే సమస్యతో రైతులు ఇబ్బంది పడుతుంటే ప్రతిపక్ష బీఆర్ఎస్ బిజెపి పార్టీలో చోద్యం చూస్తున్నాయని కనీసం స్పందించడం లేదని ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే మరియు వ్యవసాయ మంత్రి రెవిన్యూ మంత్రి స్పందించాలని అదేవిధంగా జిల్లా కలెక్టర్ ఆర్డిఓ ఎమ్మార్వో ఉన్నత అధికారులందరూ తక్షణమే ఐకెపి సెంటర్లను సందర్శించి ఈ దోపిడిని అరికట్టాలని తూకం పేరు మీద కటింగ్ పేరు మీద నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం లేదంటే రైతుల పక్షాన పోరాటానికి సిద్ధమౌతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి రాసాల బాలస్వామి, జిల్లా కమిటీ సభ్యులు కూకుట్ల శ్రీశైలం, ఏనుగు మల్లారెడ్డి, చిక్కుల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు నిర్ణయాధికారులుగా మారినప్పుడే గ్రామాభివృద్ధి సాధ్యం

**- వంగపల్లిలో 'వీ లీడ్' ఆధ్వర్యంలో**

**మహిళా లీడర్లకు ఒకరోజు ప్రత్యేక శిక్షణ**



**ఆలేరు నియోజకవర్గం/ జూన్ 05 (వార్త వేదిక సూర్య ):-** పరిపాలన, అభివృద్ధి రంగాలలో మహిళల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో భాగంగా వంగపల్లి రైతు వేదికలో ఒకరోజు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం అత్యంత విజయవంతంగా నిర్వహించారు. సరస్వతి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో, బోస్కో సేవా కేంద్రం వారి 'వీ లీడ్' ప్రాజెక్టు కింద ఏర్పాటు చేసిన ఈ శిక్షణలో వంగపల్లి, చిన్న కందుకూరు, మహబూబ్ పేట గ్రామాల మహిళా సంఘ లీడర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సరస్వతి ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ శ్రీశైలం, మహిళా శిశు సంక్షేమ శాఖ (హబ్ డిపార్ట్‌మెంట్) ప్రతినిధులు నిఖిత, పుష్ప హాజరై మహిళా నాయకురాళ్లకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా సరస్వతి ఎడ్యుకేషన్ సొసైటీ మరియు నీడ్ సిఎస్ఓ డైరెక్టర్లు సోము, శ్రీశైలం లు మాట్లాడుతూ.. మహిళలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా పరిపాలనలో చురుకుగా పాల్గొన్నప్పుడే నిజమైన గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. 'వీ లీడ్' ప్రాజెక్టు ద్వారా మహిళా నాయకురాళ్లను సమాజంలో కీలక నిర్ణయాధికారులుగా తీర్చిదిద్దుతున్నామని స్పష్టం చేశారు. అనంతరం మహిళా శిశు సంక్షేమ శాఖ హబ్ డిపార్ట్‌మెంట్ అధికారులు నిఖిత, పుష్ప మేడమ్స్ మాట్లాడుతూ.. ఇల్లే కాకుండా గ్రామ స్థాయి వరకు స్త్రీ-పురుష సమాన అవకాశాలు ఉండాలని, గ్రామ సభల్లో మహిళలు తమ ప్రశ్నలను ధైర్యంగా అడగాలని సూచించారు. పంచాయతీ నిధుల వినియోగం పర్యవేక్షణ, సంక్షేమ పథకాల అమలులో మహిళా సంఘాల పాత్ర కీలకమన్నారు.ఈ శిక్షణలో ముఖ్యంగా లింగ వివక్ష, గృహ హింస, బాల్య వివాహం వంటి సామాజిక సమస్యలను ఎలా గుర్తించాలి, వాటిపై చట్టపరంగా ఎలా స్పందించాలనే అంశాలపై మహిళలకు పక్కా అవగాహన కల్పించారు. శిక్షణ ముగింపులో పాల్గొన్న మహిళా నాయకురాళ్లంతా తాము గ్రామ సభల్లో చురుకుగా పాల్గొంటామని, తమ పరిధిలో బాల్య వివాహాలను పూర్తిగా అడ్డుకుంటామని చేతులెత్తి ఘనంగా ప్రతిజ్ఞ చేశారు.ఈ సామాజిక చైతన్య కార్యక్రమంలో పంచాయతీ సిబ్బందితో పాటు రీజినల్ కోఆర్డినేటర్ ఎస్. అంబేద్కర్, శిరీష, వెంకటేష్, సంతోష మరియు వివిధ గ్రామాల మహిళా సంఘాల లీడర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పవన్ కళ్యాణ్‌పై వ్యాఖ్యలు చేయొద్దంటూ ప్రకాష్ రాజ్‌కు హెచ్చరిక



**మహేశ్వరం, జూన్ 5 (వార్త వేదిక సూర్య) :** జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,పై అనుచిత వ్యాఖ్యలు చేయవద్దని జనసేన అభిమానులు హెచ్చరించారు. ఈ మేరకు మహేశ్వరం ప్రాంతానికి చెందిన జనసేన అభిమానుల ప్రతినిధి ఏపూరి రాజు (కింగ్) ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రకటనలో, నటుడు ప్రకాష్ రాజ్ తరచూ పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొన్నారు. తెలంగాణలో కూడా జనసేన పార్టీకి ఆదరణ ఉందని, పార్టీ కార్యకలాపాలను ప్రజలు స్వాగతిస్తున్నారని తెలిపారు. వ్యక్తిగత విమర్శలకు దూరంగా ఉండాలని, ప్రజా నాయకుల పట్ల గౌరవం పాటించాలని సూచించారు. పవన్ కళ్యాణ్‌పై పదేపదే విమర్శలు చేస్తే జనసేన అభిమానులు తీవ్రంగా స్పందించే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇకనైనా ప్రకాష్ రాజ్ తన వ్యాఖ్యల విషయంలో సంయమనం పాటించాలని కోరారు. ఈ ప్రకటనను వి.ఎం. మహేశ్వరం, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్‌కు చెందిన జనసేన అభిమానులు విడుదల చేసినట్లు తెలిపారు.

# బాల్య స్నేహితురాలికి ఆర్థిక చేయుత



**మోత్కూరు, జూన్ 05 ( వార్త వేదిక సూర్య ):** మండలంలోని దత్తప్పగూడెం గ్రామానికి చెందిన వరికుప్పల అండాలు ఇటీవల ఆకాల మృతి చెందారు. ఆమెకు విజయ, అశ్విని, ఇద్దరు కుమార్తెలు కాగా.. ఆ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తమతో 2009 బి10 పదో తరగతి చదువుకున్న పెద్దమ్మాయి విజయ కుటుంబానికి బాల్య స్నేహితులు శుక్రవారం 11,000 రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాల్య స్నేహితులు నరేష్, శ్రీకాంత్, సందీప్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ నేత శ్రీనివాస్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



**మోత్కూరు, జూన్ 05 ( వార్త వేదిక సూర్య):** బడుగు బలహీన వర్గాల సమస్యలపై నిరంతర పోరాటాలు నిర్వహిస్తున్న బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ కు, బీసీ రిజర్వేషన్ సాధన సమితి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నోముల రమేష్ నేత, మాదిగ హక్కుల దండోరా మండల అధ్యక్షుడు ఎర్రవెల్లి నాగేశ్వర్ లు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం శ్రీనివాస్ గౌడ్ జన్మదినం పురస్కరించుకొని శ్రీనివాస్ చే కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, నిండా నూరేళ్లుగా సూర్యచంద్రుల సాక్షిగా కలకాలం ఉండాలని ఆకాంక్షించారు.

యాదాద్రి భువనగిరి
# వార్త వేదిక సూర్య
సంపుటి : 2 సంచిక : 17
యాదాద్రి భువనగిరి
శనివారం,
జూన్, 6, 2026

## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం



**మోత్కూరు, జూన్ 05 ( వార్త వేదిక సూర్య):** తడిసిన ధాన్యాన్ని చివరి గింజ వరకు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తహశీల్దార్ పి.జ్యోతి అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయం మార్కెట్ లో గురువారం రాత్రి కురిసిన ఆకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం తడిసిందని రైతులు ఏ మాత్రం అధైర్య పడవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఆర్.ఐ. సుమన్ ఉన్నారు.

## మోత్కూరు మినీ ట్యాంక్ బండ్ రోడ్డును మరమ్మతులు చేయాలి

- సిపిఐ డిమాండ్



**మోత్కూరు, జూన్ 05 ( వార్త వేదిక సూర్య ):** మోత్కూరు మున్సిపల్ పరిధిలో ఉన్న కృంగిపోయిన మినీ ట్యాంక్ బండ్ రోడ్డును వెంటనే మరమ్మతులు చేయాలని. సిపిఐ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఐ పట్టణ శాఖ ఆధ్వర్యంలో కృంగిపోయిన మినీ ట్యాంక్ బండ్ రోడ్డు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది వచ్చిన వర్షాలతో కృంగిపోయిన ఈ రోడ్డు నేటికీ మరమ్మతులు చేయకపోవడం వల్ల ఈ రోడ్డు గుండా వందలాది బస్సులు, లారీలు, డీసీఎం, ద్విచక్ర వాహనాలు వెళ్తుంటాయని పేర్కొన్నారు. ఈ రోడ్డు గుండా వెళితే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నప్పటికీ అధికారులు ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా మినీ ట్యాంక్ రోడ్డుపై అధికారులు స్పందించాలని,లేని యెడల సిపిఐ పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షులు చాపల అంజయ్య, సిపిఐ మండల సహాయ కార్యదర్శి పులకరపు మల్లేశం, బిసి హక్కుల సాధన సమితి మండల కార్యదర్శి, పెండెం వెంకటేశ్వర్లు,పట్టణ నాయకులు గొలుసుల యాదగిరి,,నిలిగొండ అశోక్, బొడ్డుపల్లి వెంకన్న, కడమంచి వీరస్వామి, తాడూరి లక్ష్మీ నర్సయ్య, ఎడ్ల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్య దశలోనే చిన్నోడికి పెద్ద ఆలోచన

- వినూత్న ప్రయోగం - అట్టలు, సిరంజిలు గ్లూకోజ్ పైపులతో జేసీబీ తయారీ.



**మోత్కూరు, జూన్ 05 (వార్త వేదిక సూర్య):** మోత్కూరు మున్సిపల్ కేంద్రానికి చెందిన బోయిని , యాకమ్మబిబినర్శింహ్మా ల కుమారుడు బోయిని రిత్విక్(మింటు) స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. ఈ వేసవి సెలవుల్లో తాను ఏదో ఒకటి ప్రయోగం చేయాలనే తపనతో కేవలం అట్టలు, సిరంజిలు, గ్లూకోజ్ పైపులు, ట్యాగ్ ల సహాయం తో జేసీబీ యంత్రాన్ని తయారు చేసి ప్రయోగం చేశాడు. గతంలో వైబ్రేషన్ మిషన్ , వాటర్ మోటర్ ని తయారు చేశాడు. ఈ జేసీబీ మిషన్ని సిరంజీలలో నింపిన వాటర్, గ్లూకోజ్ పైపుల ద్వారా హైడ్రాలిక్ మోడల్ లో జేసీబీ మిషన్ ని అటు ఇటు తిప్పుతూ పైకి లేపుతూ ఆపరేట్ చేస్తున్నాడు. ఈ సందర్భంగా రిత్విక్ విలేఖరులతో మాట్లాడుతూ. చిన్నప్పటి నుండి తనకు ఎలక్ట్రానిక్స్ పరికరాలు చేయడంలో చాలా ఆసక్తి. ఉందని తెలిపారు. భవిష్యత్ కూడా తాను ఎలక్ట్రానిక్స్ రంగంలో నూతన ప్రయోగాలు చేసి ఆ దిశగా కృషి చేయాలని ఉందని పేర్కొన్నారు. పదో తరగతి పూర్తి చేసుకున్న తర్వాత పాలిటెక్నిక్ చేసి ఇంజనీరింగ్ రూట్ లో వెళ్లాలని ఆలోచన ఉందని తన మనసులో మాటను చక్కగా వివరించారు.




## వలిగొండ పోలీస్ స్టేషన్‌లో ఎస్పి అక్షాన్ష్ యాదవ్ తనిఖీలు

**వలిగొండ,జూన్ 5 (వార్తా వేదిక సూర్య) :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పోలీస్ స్టేషన్ ని శుక్రవారం రోజు వార్షిక తనిఖీలో బాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ తనిఖీ చేశారు ,ముందుగా పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తునా సిబ్బంది యొక్క యూనీఫాం దరించే విదానం మరియు వారి యొక్క వ్యక్తి గత సామగ్రి ఉండే పెట్టెను తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాన్ని సందర్శించారు. పోలీస్ స్టేషన్ లోపల జనరల్ డైరీ పరిశీలించిన తర్వాత హెల్ప్ డెస్క్ విదులు అడిగి తెలుసుకున్నారు. సెక్షన్ ఇన్చార్జి వద్ద గల జనరల్ డైరీ ని తనిఖీ చేసి వారి యొక్క విధులను గురించి విచారిం చారు,కోర్టు రికార్డు గది తనిఖీ చేసి ఎవిడెన్స్ ప్రాపర్టీ ని ఆర్డర్ లో పెట్టుకోవాలి అని ఆదేశించారు.

ఈ పెట్టి ,పిటిషన్ పెండింగ్ ,రెజిస్టర్డ్ పిటిషన్ లను ఎప్పటికీఅప్పుడు సంబందిత రికార్డు లలో పొందుపరచాలని ఆదేశించారు సి సి టి ఎన్ ఎస్ , సి ఐ ఎస్ ఆర్ ,పోర్టల్ ల పనితీరును పరిశీలించారు, సైబర్ నేరాల వివరాల యొక్క పాత కేసుల వివరాలను కంప్యూటరు లో తనిఖీ చేశారు, లాక్ అప్ రూమ్ తనిఖీ చేసి వాటిలో గల సీసీటీవీ ల పనితీరు అడిగి తెలుసుకున్నారు. రౌడీ షీటర్ ల యొక్క రికార్డు లను పరిశీలించి వారి యొక్క ప్రవర్తనల గురించి అడిగి తెలుసుకున్నారు.

పోలీస్ స్టేషన్ బయట గల రికవరీ వాహనాల ను పరిశీలించి వాటికి సంబందించిన క్రైమ్ నెంబర్ ని వాటిపైన వేసి వాటి యొక్క నేరాల నెంబర్ ఆధారంగా ఆర్డర్ లో పెట్టాలి అని ఆదేశించారు. ఈ ఇన్స్పెక్షన్




జిల్లా ఎస్పీ ఆద్వర్యంలో చౌటుప్పల్ డివిజన్ డిఎస్పి మధుసూదన్ , సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు , ఎస్సై యుగేందర్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పొడిచేడుబిబి అమ్మనబోలు బ్రిడ్జిని ఇరిగేషన్ అధికారులు సందర్శన

**మోత్కూరు, జూన్ 05 (, వార్త వేదిక సూర్య ):** మండలంలోని పొడిచేడుబిబిఅమ్మనబోలు గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జి ప్రక్కన మూసినదిలో ఉన్న శిథిలమైన లోవెల్ పాత రోడ్డును శుక్రవారం సూర్యాపేట ఇరిగేషన్ సీఈ నాగభూషణం పరిశీలించారు. వర్షాకాలం వచ్చినప్పుడల్లా ఈ శిథిలమైన ఈ పాత రోడ్డు వెళ్తున్న పశువులు గొర్రెలు ప్రజలు వరదల తాకిడికి చిక్కుకొని మరణిస్తున్నారని డిసిసి ఉపాధ్యక్షులు వంగాల సత్యనారాయణ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బ్రిడ్జి పక్కనే ఉన్నందున లోవెల్ పాత రోడ్డు పూర్తిగా తొలగించి క్రింద సుమారు 500 మీటర్ దూరంలో చెక్ డ్యామ్ నిర్మించి





రైతులకు సాగునీటి వసతి కల్పించాలని కోరగా ఇందుకు తక్షణమే స్పందించిన సీఈ నాగభూషణం ప్రతిపాదనలు వేసి పంపించాలని నీటి పారుదల ఎస్.ఈ శివ ధర్మ తేజ, ఈ.ఈ సత్యనారాయణ లను ఆదేశించినట్లు సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.ఈ.లు చంద్రశేఖర్, విక్రమ్, హరీష్,పొడిచేడు గ్రామ సర్పంచ్ జిట్ట సైదులు,ఉప సర్పంచ్ బండ లింగయ్య, మాజీ ఉపసర్పంచ్ కప్పే వెంకన్న, వార్డు సభ్యులు చందాల బీరుమల్లు,నల్ల రామ నర్సయ్య, మత్స్యగిరి, ఫీల్డ్ అసిస్టెంట్ వీరస్వామి,రచ్చ చందు, నల్ల యాదగిరి, ఇట్టబోయిన శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ చామలని కలిసిన యూత్ కాంగ్రెస్ నాయకులు



**మోత్కూరు, జూన్ 05 ( వార్త వేదిక సూర్య );** యాదాద్రి భువనగిరి లోక్‌సభ సభ్యులు (ఎంపీ ) ఎన్నికై రెండేళ్ల పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మోత్కూరుకు చెందిన యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు కందుల విక్రాంత్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విక్రాంత్ మాట్లాడుతూ ఎంపీ ప్రజాసేవలో మరెన్నో విజయాలు సాధించాలని రాజకీయంగా మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట యూత్ కాంగ్రెస్ మండల నాయకుడు దొంతోజు అశోక్ పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ ను నిషేధిద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందాం

- పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి
- కాంగ్రెస్ పార్టీ నాయకుడు మహేందర్ ముదిరాజ్ ప్లాస్టిక్ నిషేధంపై వినూత్న ప్రచారం
- ప్లాస్టిక్ ని వాడకూడదంటూ మటన్ షాప్‌కి వెళ్లి మటన్ టిఫిన్ బాక్స్ లో తెచ్చుకున్న
- కాంగ్రెస్ పార్టీ నాయకుడు గద్దగూటి మహేందర్ ముదిరాజ్

**మహేశ్వరం, జూన్ 05, వార్త వేదిక సూర్య** మహేశ్వరంలో ప్లాస్టిక్ ను నిషేధిద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందాం అంటూ మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ నాయకుడు గద్దగూటి మహేందర్ ముదిరాజ్ వినూత్న ప్రచారం మొదలుపెట్టారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలో శుక్రవారం నాడు కాంగ్రెస్ పార్టీ నాయకుడు మహేందర్ ముదిరాజ్ మహేశ్వరంలో ప్లాస్టిక్ వాడకూడదంటూ మటన్ షాప్ కు టిఫిన్ బాక్స్ తీసుకెళ్లి మటన్ బాక్స్ లో తీసుకొని వచ్చే అందరికీ ఆదర్శంగా నిలిచారు మహేందర్ ముదిరాజ్ తాను ఒక్కడినే కాకుండా మహేశ్వరం గ్రామంలో ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వాడకుండా తమ బాధ్యతగా ప్రతి ఒక్కరు టిఫిన్ బాక్సులు ఇతర వాటిను ఉపయోగిస్తూ ప్లాస్టిక్ నిషేధించడానికి ప్రతి ఒక్కరు సహకారం చేయాలని ఆయన కోరారు. ప్లాస్టిక్ నిత్యం వాడడం వల్ల ఎన్నో ప్రమాదాలు వస్తున్నాయని అంతేకాకుండా పర్యావరణానికి పెను ప్రమాదంగా మారిందని భవిష్యత్తులో ప్లాస్టిక్ కారణంగా ఎన్నో ప్రమాదాలు అనారోగ్యానికి ఎన్నో కారణాలుగా ప్లాస్టిక్ తయారవుతుందని పూర్తిగా ప్లాస్టిక్ నిషేధించేంత వరకు ప్రతి ఒక్కరు విధిగా బాధ్యతగా సహకారం అందించాలని ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ ని వాడకుండా ఉండడానికి ప్రయత్నం చేయాలని మహేందర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు.నా ఒక్కడితో మొదలైన ప్లాస్టిక్



నిషేధం ప్రతి ఒక్కరు మొదలుపెట్టి ప్లాస్టిక్ అంతం చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన అన్నారు. మనం వాడి వదిలేస్తున్న ప్లాస్టిక్ పశువులు గోవులు తిని మరణిస్తున్నాయని దీనివల్ల మరింత పర్యావరణం దెబ్బతింటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గోవులను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఆవులు దేవతల తో సమానం గోవులను పూజించాలి కానీ భక్షించకూడదని మహా పాపం అవుతుందని అన్నారు.




మహేశ్వరంలో ప్లాస్టిక్ నిర్మూలన కోసం నిరంతరం కృషి చేస్తారని మహేందర్ ముదిరాజ్ అన్నారు. నేను మొదలు పెట్టిన మార్పు గ్రామం మొత్తం మార్పు చెందే వరకు నిరంతరం కృషి చేస్తానని మహేందర్ ముదిరాజ్ అన్నారు. ప్లాస్టిక్ అంతమవుతేనే మనందరి ఆరోగ్యాలు మెరుగుపడతాయని ప్లాస్టిక్ తోనే మన అందరి అనారోగ్యానికి కారణం అవుతుందని ప్లాస్టిక్ నిషేధితం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అని మహేందర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు.

## ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ



**మోత్కూరు, జూన్ 05 ( వార్త వేదిక సూర్య):** మండలంలోని అన్ని ఎరువుల దుకాణాలను శుక్రవారం సీడ్ టాస్క్ ఫోర్స్ టీం వ్యవసాయ అధికారి పాండురంగ చారి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. డీలర్ల వద్ద పత్తి, వరి విత్తనాల సంబంధించి స్టాక్ రిజిస్టర్, స్టాక్ ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా.ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను అందజేయాలని సూచించారు, లైసెన్స్ ఉన్న విత్తనాల డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన తర్వాత రైతులు రషీదు తప్పనిసరిగా తీసుకొని పంట పూర్తయ్యేంతవరకు భద్రపరుచుకోవాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి వద్దేమాన్ కీర్తి ఉన్నారు.




Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305,** Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**